

అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శుక్రవారం 14 జూన్ 2024 పేజీలు : 04


# కూటమి ఎమ్మెల్యేగా ప్రజలకు మరింత పాలన అందిస్తాం

- ఈ నెల 16న ఆత్మీయ సమావేశం - మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

**కదిరి, జూన్ 13 ప్రభాతవార్త**

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి, బిజెపి, జనసేన కూటమిని రాష్ట్ర ప్రజలు ఆదరించి అత్యధిక మెజార్టీతో అభ్యర్థులను గెలిపించుకున్నారని, అలాగే కదిరి నియోజకవర్గ ఎమ్మెల్యేగా తనకు కూడా ఆదరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నట్లు కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కదిరి నియోజకవర్గ ప్రజలు తనపై నమ్మకం ఉంచి తనను ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించారని ఇందులో టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలు తన విజయానికి ఎంతో కృషి చేశారన్నారు. కదిరి ఎమ్మెల్యేగా నియోజకవర్గ ప్రజలు మరింత బాధ్యత పెట్టారన్న నమ్మకాన్ని నిలబెట్టుకోవడంతోపాటు ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. 20 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవంలో ఎన్నో పోరాటాలు చేశానని, జగన్‌మోహన్‌రెడ్డి అరాచక పాలనలో టిడిపి కార్యకర్తలు, నాయకులపై అక్రమ కేసులు బనాయించారన్నారు. స్థానికంగా ఉన్న నాయకులకు ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు అభివృద్ధి పనులను సైతం చేపడుతామన్నారు. ఎన్నికల ప్రచారానికి గ్రామాల్లోకి వెళ్లిన సమయంలో స్థానికంగా ఉన్న నాయకులు, కార్యకర్తలు, నాయకులకు భోజనాలు పెట్టారన్నారు. వారందరికీ భోజనాలు పెట్టాలన్న ఉద్దేశ్యంతో ఈ నెల 16న పట్టణంలోని పివిఆర్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకి కూటమి కార్యకర్తలు, నాయకులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులో విందు సైతం ఏర్పాటు చేసినట్లు శాసనసభ్యులు తెలిపారు. బిజెపి ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే పార్థసారధి, వంశీకృష్ణ, జనసేన ఇన్‌చార్జ్ భైరవప్రసాద్‌తోపాటు ఇతర నాయకులందరిని ఆహ్వానించామన్నారు. ప్రతి కార్యకర్త ఇదే ఆహ్వానంగా భావించి ఆత్మీయ సమావేశం, విందు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. మీడియా సమావేశంలో పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్ రాజశేఖర్‌బాబు, నల్లచెరువు మండల కన్వీనర్‌రాజశేఖర్, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నియంత్రణకు
# పకడ్బందీ చర్యలు తీసుకోవాలి





మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, సమావేశంలో పాల్గొన్న అధికారులు

**అనంతపురం కలెక్టరేట్, జూన్ 13 ప్రభాతవార్త**

జిల్లాలో బాల్య వివాహాల నియంత్రణపై పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. గురువారం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా బాలల పరిరక్షణ సమితి, చైల్డ్ హెల్ప్‌లైన్ అధికారులు, సిబ్బంది, ఐసిడిఎస్ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలకు సంబంధించిన చట్టాలను అమలు చేయడంలో డిసిపియు, చైల్డ్‌హెల్ప్‌లైన్ విభాగము వారు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. జిల్లాలో బాల్య వివాహాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలు, చైల్డ్ లేబర్ వున్న ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. బాల్య వివాహాలకు సంబంధించి సమాచారం వచ్చిన వెంటనే సంబంధిత అధికారులు చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని చైల్డ్ మ్యారేజ్ కేసు పెట్టాలన్నారు. జువైనల్ జస్టిస్, ఫోక్సో, పిసిపిఎన్‌డిటి, రైట్ టు ఎడ్యుకేషన్, తలాక్ సిస్టం లాంటి 8 రకాల చట్టాల గురించి అవగాహన వుండాలన్నారు. ప్రతి చట్టం గురించి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై వుందన్నారు. ఐఈసి యాక్టివిటీలను చిత్తశుద్ధితో నిర్వహించాలని, మారుమూల మండలాలైన బొమ్మనహాల్, డి.హీరేహాల్, పెద్దపప్పూరు. యల్లనూరు మండలాల్లో పర్యటించాలని సీజన్ బట్టి కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఐసిడిఎస్ పిడి బిఎన్ శ్రీదేవి, జిల్లా బాలల పరిరక్షణ సమితి అధికారి మంజునాథ్, ప్రొటెక్షన్ ఆఫీసర్స్ వెంకటేశ్వరి, సంధ్య, చైల్డ్‌లైన్ కో ఆర్డినేటర్ కృష్ణమాచారి, డిసిపిఐ సిబ్బంది వసంత, సంధ్య, వెంకటకుమార్, రమాదేవి, కమలాక్షి, సమీర్, రామాంజనమ్మ, చైల్డ్‌లైన్ సిబ్బంది సురేష్, ఇర్ఫాన్, సుహాసిని, నిర్మల, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

**ఆర్అండ్‌బి శాఖపై సమీక్ష :**

అంతకుముందు ఆర్అండ్‌బి శాఖపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఆర్అండ్‌బి పరిధిలో రహదారులు ఎన్ని కిలోమీటర్లు వున్నాయి, మరమ్మతుల వివరాలు, పనుల పురోగతి ఎంత మంది అధికారులు, సిబ్బంది వున్నారు తదితర అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రహదారుల యాన్యువల్ మెయింటెనెన్స్‌కు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. రహదారులు, భవనాల నిర్మాణం పురోగతిపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఈఈ రాజగోపాల్, వెంకటరమణ, డిఇలు బాలకాటమయ్య, శ్రీధర్‌రెడ్డి, సురేష్‌నాయక్, రవిశంకర్‌రెడ్డి, ఎఇలు పాల్గొన్నారు.

# ఉచిత విద్య..అంతా మిథ్య..!

- చట్టంలో ఉచితం..ఫీజులు చెల్లించాలనడం నిజం..!
- పేదలకు 'మిథ్యా'హక్కుచట్టంగా మారిన వైనం..!
- ప్రశ్నార్థకంగా మారిన 25 శాతం సీట్ల అమలు తీరు..!



**తాడిపత్రి, జూన్ 13, ప్రభాతవార్త**

పేద విద్యార్థులకు విద్యాహక్కు చట్టం ద్వారా ప్రయివేటు పాఠశాలల్లో ఉచితంగా ప్రవేశం కల్పించాలనే పథకం ఆది నుంచి అష్టకష్టాలను ఎదుర్కొంటోంది. విద్యాహక్కు చట్టం-2009అనుసరించి పుస్తకాలు, ఏకరూప దుస్తులు ఇచ్చి కార్పోరేట్ విద్యాసంస్థల్లో ఉచిత విద్యను అందిస్తారనుకున్న తల్లిదండ్రుల ఆశలు తలకిందులవుతున్నాయి. ఫీజు మాత్రమే మినహాయింపు ఉంటుందని, విద్యాసామగ్రి సొంతంగా కొనుగోలు చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు. విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ప్రభుత్వం ఇప్పటి వరకు అమ్మఒడి, ఇప్పటి నుంచి అమ్మకు వందనం పేర్లతో జమచేసే నగదును తీసుకొచ్చి ఫీజుగా సంబంధిత ప్రయివేటు పాఠశాలల్లో చెల్లించాలనే నిబంధనతో కార్పోరేట్ విద్యాసంస్థల్లో ఉచిత సీట్లు పొందిన విద్యార్థుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది.

**విద్యాహక్కు చట్టం అమలు తీరు..!**

అనంతపురం జిల్లా వ్యాప్తంగా గత మూడేళ్లుగా విద్యాహక్కు చట్టం అమలు తీరును పరిశీలిస్తే చట్టంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం లేదని, అమలు తీరును అధికారులు పట్టించుకోవడం లేదని తేటతెల్లమవుతోంది. 2022-23 విద్యాసంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 739 మంది విద్యార్థులకు విద్యాహక్కు చట్టం ద్వారా ప్రవేశం కల్పిస్తే తాడిపత్రి నియోజకవర్గంలో పెద్దవడుగూరు నుంచి ముగ్గురికి, యాడికి నుంచి ఇద్దరికి మాత్రమే అవకాశం దక్కింది. 2023-24 విద్యాసంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 742 మందికి ప్రవేశం కల్పిస్తే తాడిపత్రి నియోజకవర్గంలో తాడిపత్రి నుంచి 27 మందికి, పెద్దవడుగూరు నుంచి 5 మందికి, యాడికి నుంచి ఇద్దరికి మాత్రమే అవకాశం కల్పించారు. ఇక ఈ 2024-25 విద్యా సంవత్సరంలో 1,104 మంది ఉచిత కార్పోరేట్ విద్యకు దరఖాస్తు చేసుకోగా తాడిపత్రి నియోజకవర్గంలో తాడిపత్రి నుంచి 103 మంది, యాడికి నుంచి 10 మంది, పెద్దవడుగూరు నుంచి ఏడుగురు, పెద్దపప్పూరు నుంచి ఒకరు వంతున దరఖాస్తు చేసుకున్నారు. అయితే జిల్లా వ్యాప్తంగా 417 మందిని మాత్రమే అర్హులుగా నిర్ధారించినట్లు, వీరిలో తాడిపత్రి నియోజకవర్గంలో తాడిపత్రి నుంచి 25 మందిని, పెద్దవడుగూరు నుంచి ఇద్దరిని మాత్రమే అర్హులుగా నిర్ధారించినప్పటికీ ఇంకా ప్రవేశాలు కల్పించలేదని తెలుస్తోంది.

**యాజమాన్యాలపై ఫిర్యాదులు**

విద్యాహక్కు చట్టం-2009ని అనుసరించి 2024-25 విద్యాసంవత్సరానికి ప్రవేశాలు జరుగుతున్నాయి. నిబంధనల ప్రకారం 1వ తరగతిలో ప్రవేశాలు పొందిన 25 శాతం మంది నిరుపేద విద్యార్థులకు కార్పోరేట్ పాఠశాలలు 8వ తరగతి వరకు ఉచిత విద్యను అందించాలి. అయితే కొన్నిచోట్ల యాజమాన్యాలు వివిధ కారణాలను చూపి దరఖాస్తులను తిరస్కరిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి ప్రయివేటు, కార్పోరేట్ పాఠశాల 1వ తరగతి ప్రవేశాల్లో 25 శాతం మంది పేద విద్యార్థులకు ఉచిత విద్య అవకాశం కల్పించాలి. ఈ విద్యాసంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న 1,104 మంది విద్యార్థుల్లో 417 మందికి, తాడిపత్రి నియోజకవర్గంలో 121 మంది దరఖాస్తు చేసుకుంటే 27 మందికి మాత్రమే అవకాశం కల్పించడం గమనార్హం. యాజమాన్యాలకు చట్టం పట్ల చులకన భావన ఉందనడానికి ఈ ప్రవేశాలే నిదర్శనమని తల్లిదండ్రుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో రూ. 8 వేలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ. 6,500 లు, గిరిజన ప్రాంతాల్లో రూ.5,100 లు వంతున ప్రయివేటు, కార్పోరేట్ పాఠశాలల్లో 1వ తరగతిలో ఉచిత విద్యకు ఎంపికైన విద్యార్థుల ఫీజులు ఆయా పాఠశాలలకు ప్రభుత్వమే చెల్లించాల్సి ఉంటుంది. నిర్దేశించిన రుసుముల కంటే అధికంగా వసూలు చేస్తున్నారని కొన్ని పాఠశాలల యాజమాన్యాలపై ఆరోపణలు వచ్చిన సందర్భాలున్నాయి. ఆయా పాఠశాలల్లో బోధన విషయంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని విద్యాధికారులు చెబుతుండటం విశేషం.

# భారత రాష్ట్రపతితో సమావేశమైన బిజెపి నేత విష్ణువర్ధన్‌రెడ్డి

**అనంతపురం, జూన్ 13 ప్రభాతవార్త బ్యూరో**

ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఈ రోజు ఉదయం బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు (ఆంధ్రప్రదేశ్) విష్ణువర్ధన్‌రెడ్డి రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముతో సమావేశం అవడం జరిగింది. రానున్న రోజుల్లో గిరిజన ప్రాంతాల్లో ప్రతిభావంతమైనటువంటి విద్యార్థులను ప్రోత్సహించడానికి ఢిల్లీ కేంద్రంగా ఒక కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందని ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని తమ విలువైన సందేశాన్ని ఇవ్వాలని ఈ కార్యక్రమం కోసం వారి సమయాన్ని కేటాయించాలని కోరడంజరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సంబంధించిన సమగ్రమైన నివేదికను రాష్ట్రపతి ప్రత్యక్షంగా పంపమని వారు కోరారని, కచ్చితంగా కార్యక్రమాన్ని సమయం ఇస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గతంలో నెహ్రూ కేంద్ర సంఘటన ద్వారా దేశంలో జరిగిన వివిధ కార్యక్రమాలకు సంబంధించిన ప్రత్యేకమైన నివేదికను వారికి అందజేయడం జరిగిందని తెలిపారు. నెహ్రూ యువ కేంద్ర సంఘటన దేశ వ్యాప్తంగా భారత ప్రభుత్వంలోని యువజన క్రీడల మంత్రిత్వశాఖ ద్వారా చేపట్టిన వందలాది కార్యక్రమాలు, వాటి ద్వారా యువత పొందే లబ్ధి గురించి రాష్ట్రపతికి ప్రత్యేకంగా వివరించడం జరిగిందని వారు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో ఉన్నటువంటి పేద విద్యార్థులు గుర్తించి వారిలోని ప్రతిభను వెలికి తీసేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. దేశ వ్యాప్తంగా వారిని పలు ప్రాంతాల్లో గిరిజన విద్యార్థులకు చేపట్టిన క ఆర్యక్రమాలు తెలియజేయడం జరిగింది. వీటితోపాటు దేశంలో విద్యార్థి, యువత కోసం ప్రత్యేకంగా యూత్ పార్లమెంట్ నిర్వహించి నాయకత్వ లక్షణాలు ఉన్న వారిని ప్రోత్సహించడం జరిగిందని, అదే విధంగా ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్ ద్వారా వేల మంది విద్యార్థులను వివిధ రాష్ట్రాలకు పంపి అక్కడ అభివృద్ధి, స్థితిగతులపై వారికి అవగాహన కలిగేలా పలు రకాల కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రత్యేకంగా కలుసుకోవడానికి సమయం ఇచ్చిన రాష్ట్రపతికి ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలియజేశారు.



రాష్ట్రపతికి పుష్పగుచ్చాలు అందిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

# రైతులకు అవసరమైన మేర విత్తనం అందించండి

- జిల్లా వ్యవసాయ అధికారులకు పరిటాల సునీత సూచన - ఎమ్మెల్యే అయ్యాక తొలిసారి రైతు సమస్యలపై దృష్టి



వ్యవసాయ అధికారులతో మాట్లాడుతున్న రాప్తాడు ఎమ్మెల్యే సునీత

**రామగిరి, జూన్ 13 ప్రభాతవార్త**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో సంవృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయని, ఇలాంటి సమయంలో రైతులకు అవసరమైన విత్తనాన్ని అందుబాటులో ఉంచాలని, రెండు జిల్లాల వ్యవసాయ అధికారులకు మాజీ మంత్రి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. ఎమ్మెల్యే అయ్యాక జిల్లాలో ఎవరూ చేయని విధంగా రైతు సమస్యలపై ఆమె దృష్టి సారించారు. నసనకోట పంచాయితీలోని రైతు భరోసా కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. అక్కడ రైతులకు వేరుశనగ విత్తనం అందిస్తున్న తీరు, అందుబాటులో ఉన్న స్టాక్ గురించి ఆరా తీశారు. రైతులు ఎక్కువగా వేరుశనగ, కందులు ఆముదం విత్తనం అడుగుతున్నారని సిబ్బంది సునీత దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సునీత రెండు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. గతంలో వర్షాభావ పరిస్థితులు, వరుస పంట నష్టాలు ఎదురవుతున్న నేపథ్యంలో మాట్లాడారు. గతంలో వర్షాభావ పరిస్థితులు, వరుస పంట నష్టాలు ఎదురవుతున్న నేపథ్యంలో వేరుశనగ సాగు తగ్గిందని, అయితే ఇప్పుడు వర్షాలు ఎక్కువగా కురుస్తున్నాయని, రైతులు వేరుశెనగ వేయాలని ఆసక్తి చూపుతున్నట్టు వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో వారికి అవసరమైన విత్తనాన్ని అందుబాటులో ఉంచాలన్నారు. అలాగే అంతర పంటగా కంది కూడా ఎక్కువగా అడుతున్నారన్నారు. ఆముదంతోపాటు చిరు ధాన్యాల విత్తనం కూడా రైతులు సాగు చేస్తారని, ఇందుకు సంబంధించిన విత్తనాన్ని సిద్దంగా ఉంచాలన్నారు. ఈ విషయాన్ని రెండు జిల్లాల కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్తానన్నారు. రైతులు సకాలంలో విత్తనం వేసేలా చొరవ తీసుకోవాలన్నారు. వారికి అవసరమైన సలహాలు సూచనలు ఎప్పిటికప్పుడు చేయడమే కాకుండా వ్యవసాయ శాఖ సిబ్బంది పొలాల్లో పర్యటించేలా చర్యలు తీసుకోవాలని సునీత అధికారులతో అన్నారు. దీనిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనం మాత్రమే సరఫరా చేయాలన్నారు. రైతులకు విత్తనం తీసుకునేటప్పుడు నాణ్యత లేకుంటే వెంటనే వెనక్కు ఇవ్వాలన్నారు. వ్యవసాయశాఖ అధికారుల దృష్టికి సమస్యలు తీసుకెళ్లాన్నారు. వారు స్పందించకపోతే నా దృష్టికి తీసుకుని రావాలని సునీత సూచించారు.

# అధికారులు అప్రమత్తంగా పనిచేయాలి

- హెచ్ఎన్ఎస్ఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలి - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



హాజరైన అధికారులు

**అనంతపురం కలెక్టరేట్, జూన్ 13 ప్రభాతవార్త**

రాబోయే రోజుల్లో అధికారులు అప్రమత్తంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్ట్‌పై సంబంధిత ఎస్ఇ, ఈఈలు, డిఇ, ఏఇఇలతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హెచ్ఎన్ఎస్ఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఇంజనీర్లు ఎప్పటికప్పుడు షెడ్యూల్ ప్రకారం తనిఖీలు నిర్వహించాలన్నారు. రాబోయే రోజుల్లో ప్రణాళిక ప్రకారం పనిచేయాలని హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఇ, హెచ్ఎల్‌సి ఎఇ, మైనర్ ఇరిగేషన్ ఎస్ఇలు ప్రతినెలా టూర్ డైరీని అందించాలన్నారు. ప్రాజెక్ట్ పరిధిలో ఏమైనా సమస్యలు వున్నా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. జిల్లా నుండి హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఇ, హెచ్ఎల్‌సి ఎస్ఇ, మైనర్ ఇరిగేషన్ ఎస్ఇలు ప్రతినెలా హెడ్ ఆఫీస్‌కు వెళ్లాలని, జిల్లా సమస్యలను రాష్ట్రస్థాయిలో ప్రస్తావించాలని, అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లాలన్నారు. అధికారులు హెచ్ఎన్ఎస్ఎస్, హెచ్ఎల్‌సి, మైనర్ ఇరిగేషన్ పరిధిలో చేపట్టిన ప్రాజెక్ట్‌లు, కాలువల వివరాలు పూర్తిగా తెలిసేలా గూగుల్ మ్యాప్ తయారు చేసి ఇవ్వాలన్నారు. జిల్లాలో మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు, రిజర్వాయర్లలో చెట్లు, మొక్కల పెంపకానికి వున్న అవకాశాలను పరిశీలించాలని, నిపుణులతో సంప్రదించి ఎలాంటి ఇబ్బంది లేకుండా చెట్లు, మొక్కల పెంపకానికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ప్రవహించే పెన్నానది పరిధిలో గట్లపై మొక్కల పెంపకం చేయాలన్నారు. ఈ సందర్భంగా హెచ్ఎన్ఎస్ఎస్, హెచ్ఎల్‌సి, మైనర్ ఇరిగేషన్ పరిధిలో జిల్లాలో వున్న రిజర్వాయర్లు, కాలువలు, ఆయకట్టు, ఎంత మంది అధికారులు, సిబ్బంది వున్నారు, తదితర వివరాలను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఇ దేశేనాయక్, స్పెషల్ డిప్యూటి కలెక్టర్ వెన్నెల శ్రీను, ఈఈలు రాజస్వరూప్‌కుమార్, నారాయణనాయక్, ప్రతాప్, శ్రీనివాసనాయక్, డిఇఇలు కృష్ణదాస్‌గుప్తా, గురునాథరెడ్డి, ఇతర డిఇలు, ఎఇఇలు పాల్గొన్నారు.

# ఎన్డీఏ మంత్రులకు శుభాకాంక్షలు తెలిపిన టిడిపి రాష్ట్ర కార్యదర్శి

- అనంతపురం అర్బన్ బ్యాంకు చైర్మన్ జెయల్ మురళీధర్











మంత్రులకు శుభాకాక్షలు తెలుపుతున్న అర్బన్ బ్యాంకు చైర్మన్ జెఎల్ మురళీధర్

**అనంతపురం అర్బన్, జూన్ 13 ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అఖండ విజయాన్ని సాధించిన తెలుగు దేశం పార్టీ అధినేత ముఖ్య మంత్రి నారా చంద్ర బాబునా యుడు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం సంపాధిం చిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరపు అచ్చం నాయుడు, పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్, టిజి భరత్ తదితర మంత్రు లను గురువారం వారి నివాసాల్లో కలిసి ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేయడం జరిగింది. వీరితోపాటు విజయవాడ సెంట్రల్ నియోజకవ ర్గంలో అత్యధిక మెజార్టీతో గెలుపొందిన బోండా ఉమా మహేశ్వర రావుని కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్ర మంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర రాష్ట్ర, అర్బన్ బ్యాకుచైర్మన్ అయినటు వంటి జెఎల్ మురళీధర్, ఆంధ్రప్రదేశ్ షాప్ రాష్ట్ర మాజీ డైరెక్టర్, ప్రముఖ ముస్లిం మైనార్టీ రాష్ట్ర నాయకుడు కేఎం షకీల్ షఫీ, కాపు కార్పోరేషన్, మాజీ డైరెక్టర్, రాష్ట్ర కార్యదర్శి అయిన టువంటి కంట రాయల్ మురళీమో హన్, బుగ్గయ్యచౌదరి, ముస్లిం మైనార్టీ రాష్ట్ర నాయకులు తాజుద్దీన్, నందమూరి బాలకృష్ణ, అభిమాన సం ఘం నాయ కులు కాయగూరల శ్రీధర్, యువ నాయకుడు అనిల్‌నాయుడు, కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## మండల విద్యాశాఖ కార్యాలయం ఆకస్మిక తనిఖీ



ఎంఈఓ కార్యలయాన్ని తనిఖీ చేస్తున్న విద్యాశాఖ అధికారి రంగస్వామి

**గోరంట్ల జూన్ 13 ప్రభాతవార్త**

గోరంట్ల పట్టణంలోని స్ధానిక మండల విద్యాశాఖ కార్యలయాన్ని గురువారం పెనుకొండ ఉప విద్యాశాఖ అధికారి రంగస్వామి ఆకస్మిక తనిఖీ చేశారు. అలాగే విద్యాసంవత్సరం ప్రారంభం సందర్భంగా ప్రభుత్వ మరయు ప్రైవేటు విద్యాసంస్ధలు పునఃప్రారంభించడం జరిగింది కావున పేజ్‌వన్‌లో భాగంగా మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం నుండి చేరిన స్టూడెంట్ కిట్స్‌ను మండలంలోని స్టాక్‌పాయింట్ నుండి పాఠశాలలకు సరఫరా చేయడం జరుగుతుంది. ఈ సందర్భంగా మండలంలోని స్టాక్ పాయింట్‌ను పెనుకొండ ఉప విద్యాశాఖ అధికారి తనిఖీలు చేశారు. అలాగే ఆయన విద్యాధికారులతో మాట్లాడుతూ సూడెంట్ కిట్స్‌ను సక్రమంగా పాఠశాలలకు చేరవేసి పాఠశాల నుండి విద్యార్ధిని విద్యార్ధులకు సక్రమంగా అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి గోపాల్, సిఆర్ ఎంటిపిటిఐలు, మరియు ఎంఈఓ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఫుట్‌బాల్ జట్టు ఎంపిక



ఎంపికైన జట్టుతో అసోసియేషన్ సభ్యులు

**హిందూపురం టౌన్, జూన్ 13 ప్రభాతవార్త**

సత్యసాయి జిల్లా సబ్ జూనియర్స్, జూనియర్స్ బాలికల ఫుట్‌బాల్ జట్టును గురువారం పట్టణంలోని ఎంజిఎం క్రీడామైదానంలో ఎంపిక చేశారు. ఎంపికైన జట్లు రాష్ట్రస్ధాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని సత్యసాయి జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు జెవి అనిల్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫుట్‌బాల్ అసోసియేషన్ కోశాధికారి శేఖర్, కార్యదర్శి మహమ్మద్ సలీం, విజయవాణి, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

## బస్టాండ్ పార్కింగ్ రూ.32 లక్షలకు వేలం



వేలంపాట నిర్వహిస్తున్న దృశ్యం

**లేపాక్షి, జూన్ 13 ప్రభాతవార్త**

మండల కేంద్రమైన లేపాక్షిలోని బస్టాండ్, సంతమార్కెట్ వేలంపాట ఇఒఆర్‌డి శివన్న ఆధ్వర్యంలో సర్పంచు ఆదినారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన వేలంపాట బస్టాండ్ పార్కింగ్ వేలాన్ని 32,25,000 రూపాయలకు లేపాక్షికి చెందిన వ్యక్తి దక్కించుకున్నారు. అదేవిధంగా సంతమార్కెట్ 1,81,000 రూపాయల వరకు వేలం కొనసాగింది. అయితే పంచాయతీ అధికారులు 3 లక్షల రూపాయలకు వారపుసంత మార్కెట్‌ను మూల విలువగా ప్రకటించారు. దీంతో వేలంపాట రద్దయింది. మరలా వారపు సంత మార్కెట్ వేలంపాట ఈ నెల 15వతేదీ శనివారం నిర్వహిస్తున్నట్లు ఇఒఆర్‌డి శివన్న తెలిపారు.

## కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన ఈరలక్కప్ప



కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న వైకాపా నేతలు

**గుడిబండ, జూన్ 13 ప్రభాతవార్త**

గుడిబండ మండల పరిధిలోని మందలపల్లిగ్రామానికి చెందిన వైకాపా కార్యకర్త హనుమంతరాయప్ప ఇటీవల వైఎస్ఆర్‌సిపి పరాజయాన్ని జీర్ణించుకోలేక ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా మడకశిర వైకాపా ఇన్‌చార్జ్ ఈరలక్కప్ప, గుడిబండ మండల అధ్యక్షులు డిఎల్ ఎంజారేగౌడ్, స్థానిక సర్పంచు అశ్వత్ తదితర వైకాపా నాయకులు హనుమంతరాయప్ప కుటుంబాన్ని పరామర్శించారు. ఈ క్రమంలో వారు మాట్లాడుతూ.. వైఎస్ఆర్‌సిపి ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జబివుల్లా, ఎంజారప్ప, పరమేష్, శివన్న, బోజేగౌడ్ తదితర వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శుద్ధమైన తాగునీటిని పంపిణీ చేయాలి



గ్రామ పంచాయితీ సభ్యుల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

**పావగడ, జూన్ 13 ప్రభాతవార్త**

పావగడ తాలూకాలోని బ్యాడనూరు గ్రామ పంచాయితీలోని గ్రామాలలో స్వచ్ఛతను కాపాడి ప్రజలకు శుద్ధమైన త్రాగునీటిని అందించాలని గ్రామ పంచాయితీ అధ్యక్షురాలు శృతి జి.కృష్ణపంచాయితీ అధికారులకు, సిబ్బందికి సూచించారు. గురువారం గ్రామ పంచాయితీలో నిర్వహించిన సామాన్య సభకు అధ్యక్షత వహించి మాట్లాడుతూ.. గ్రామాల్లోని ప్రజలకు అవసరమైన తాగునీటిని అందించాలని నీటి కొరత రాకుండా చూడాలన్నారు. ప్రతి గ్రామంలోని వార్డులలో స్వచ్ఛతను కాపాడాలని పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతను కాపాడాలని సూచించారు. వీధి దీపాలు అలవర్చాలన్నారు. వ గ్రామ పంచాయితీలోని గ్రామాలలోని సమస్యలపై చర్చించారు. ఈ సభలో బ్యాడనూరు గ్రామ పంచాయితీ ఉపాధ్యక్షులు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

## 15న విద్యుత్ సరఫరాలో అంతరాయం

**గుంతకల్లు, జూన్ 13 ప్రభాతవార్త**

ఈ నెల 15వతేదీ శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో డిఇ ఎ.రంగస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంతకల్లు పరిధిలోని గుత్తి 220 కెవి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గుంతకల్లు పట్టణం, గుంతకల్లు రూరల్, వజ్రకరూరు మండల పరిధిలో ఉదయం 11 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఇందుకు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకే వేరుశనగ

- ఏఓ శేఖర్‌నాయక్



రైతులకు వేరుశనగ ఇస్తున్న దృశ్యం

**అగళి, జూన్ 13 ప్రభాతవార్త**

రైతులు వేరుశనగ అవసరమైన వారు ముందుగానే రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి 1బి, ఆధార్‌కార్డు, ఫోన్ నెంబర్లు తీసుకెళ్లి వేరుశనగ కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకే కాయలను పంపినీ చేస్తున్నట్లు ఏఓ శేఖర్ నాయక్ తెలిపారు. గురువారం పి.బ్యాడిగెఎర గ్రామంలో ప్రభుత్వం పంపిణీ చేసే కాయలు టెంపోద్వారా కర్ణాటకకు తరలిపోతున్నాయన్న విషయం నిజం కాదని ఏఓ తెలిపారు. గ్రామంలో లక్ష్మమ్మ, గిరిజమ్మ, సిద్దప్ప, ఈరమ్మ, శివన్న, కరియమ్మ అనే రైతులకు గురువారం రైతు భరోసా కేంద్రంలో విత్తన కాయలను పంపిణీ చేసినట్లు తెలిపారు. సదరు రైతులు ఒక వాహనాన్ని ఏర్పాటు చే సుకుని వారి ఇళ్లకు విత్తన వేరుశనగ బస్తాలను తీసుకెళ్లారని, చివరగా గంగాధర్ అనే రైతు తనకు రెండు బస్తాల వేరుశనక్కాలు కావాలని రైతు భరోసా కేంద్రానికి వచ్చారు. ఇది వరకే రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు మాత్రమే ఈ రోజు పంపిణీ చేయానలి, ఏఈఓ మారుతమ్మ తెలిపారు. కానీ గంగాధర్ అనే రైతు, రైతులు వేరుశనగ తరలింపుకు తెచ్చుకున్న వాహనాన్ని ఫోటో తీసి కర్ణాటకకు తరలిస్తున్నారని ఆరోపించగా ఆ గ్రామాన్ని ఏఈఓతోపాటు వ్యవసాయ అధికారి శేఖర్‌నాయక్, రైతుల సమక్షంలో విచారించగా సదరు రైతులు తామే తీసుకున్నామని తెలిపారు. ట్రక్ యజమానికి పిలిపించి విచారించగా రైతుల ఇళ్లకు కాయలను చేర్చామని వారి ఇళ్లకు కూడా వెళ్లి విచారించినట్లు ఏఓ తెలిపారు.

## శాంతిభద్రతలపై ప్రత్యేక నిఘా




ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

**అమరాపురం, జూన్ 13 ప్రభాతవార్త**

మండల కేంద్రంలో శాంతిభద్రతలపై స్థానిక ఎస్ఐ జనార్ధన్‌నాయుడు ప్రత్యేక నిఘా వుంచడంతో పాటు తమ సిబ్బందితో ఫుట్ పెట్రోలింగ్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. మండల కేంద్రమైన అమరాపురంలోని వీధుల్లో పర్యటించి పోలీసు సేవలను వివరించడం జరిగింది. అదేవిధంగా వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని మద్దనకుంట చెక్‌పోస్టు వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలను తనిఖీ చేసి అదేవిధంగా రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ మధుసూదన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్‌బికెల ద్వారా రైతులకు కందుల పంపిణీ



ఎన్.రాజేష్‌బాబు

**మడకశిర జూన్ 13 ప్రభాతవార్త**

మడకశిర గ్రామంలోని రైతులకు రైతుల భరోసా కేంద్రంలో నేటి నుండి ఎల్ఆర్‌జి-52 రకం కందులను సబ్సిడీతో పంపిణీ చేయనున్నట్లు రైతుభరోసా కేంద్రం ఇంఛార్జ్ ఎన్.రాజేష్‌బాబు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ అవకాశాన్ని మడకశిర మరియు మల్లినాయకనలపల్లి రైతులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

## ప్రారంభమైన విద్యాసంస్థలు



ఆదర్శ పాఠశాల ప్రారంభమైన దృశ్యం

**అమరాపురం, జూన్ 13 ప్రభాతవార్త**

మండల వ్యాప్తంగా గురువారం నుండి విద్యాసంస్థలు పునఃప్రారంభం కావడంతో విద్యార్థులు బడిబాట పట్టారు. నూతన విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో విద్యార్థులు విద్యాసామాగ్రి కొనుగోలుపై దృష్టి సారించారు. ప్రతి ఏడాది లాగే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాల పంపిణీ మరియు ఇతర సౌకర్యాలపై స్థానిక మండల విద్యాశాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్నారు. ఎంత మంది విద్యార్థులకు పంపిణీ చేస్తున్నారు అనే వివరాలు తెలియాల్సి వుంది.

## అలరించిన సంగీత,నృత్యరూపకం



నాట్యం చేస్తున్న బాలవికాస్ విద్యార్థులు.

**పుట్టపర్తి రూరల్ జూన్ 13 ప్రభాతవార్త**

పుట్టపర్తి ప్రశాంతినిలయంలోని సాయికుల్వంత్ సభా మండపంలో హర్యానా, చండీగఢ్‌కు భక్తుల పర్తియాత్రలో భాగంగా నిర్వహించిన సంగీత నృత్య రూపకాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ ప్రదర్శనలో ఆ రాష్ట్రాలకు చెందిన బాలవికాస్ విద్యార్థులు నిర్వహించిన ఆనందం శ్రీసాయి చరణం అను అద్భుతమైన నృత్యరూపకం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. అనంతరం విద్యార్థులకు ట్రస్ట్ వర్గాలు విద్యార్థులకు నూతన వస్త్రాలు బహుకరించారు. అనంతరం భజన గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది హర్యాణా, చండీగఢ్ భక్తులతో పాటు, పెద్దఎత్తున సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

## కురుబల ఐక్యతతోనే రాజ్యాధికారం



ఐక్యత చూపుతున్న కురుబ సంఘం నాయకులు.

**బుక్కపట్నం జూన్ 13 ప్రభాతవార్త**

బుక్కపట్నం మండల కేంద్రంలో నవ్యాంధ్ర రథసారధి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రివర్గంలో చేరబోతున్న మాకురబ ముద్దుబిడ్డ సబితమ్మ మరియు బిసి సామాజిక వర్గానికి చెందిన సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆనందం వ్యక్తం చేసిన శ్రీసత్యసాయి జిల్లా కురవ సంఘం జిల్లా అధ్యక్షుడు సామకోటి ఆదినారాయణ, కురవ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేసాని ఆదినారాయణ, కురవ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తలమర్ల కమ్మన్న, జిల్లా బిసి కురవ సంఘం నాయకులు బసినపల్లి పార్ధసారధి, కురవ సంఘం జిల్లా ముఖ్య నాయకులు కాటుమయ్య, బెల్లం తిరుపాల్ అనంతరం ఈ సందర్భంగా బుధవారం పత్రిక ముఖంగా నాయకులు మాట్లాడుతూ కురుబలకు రాజ్యాధికారం కోసం ఐక్యత కోసం కురుబల రాజకీయ చైతన్యం కోసం, ఈరోజు కురుబలంతా ఏకమై రాజ్యాధికారం దిశగా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి తేవడం కోసం ప్రతి కురుబ కుటుంబ సభ్యులు గెలుపు కోసం అడుగులు వేసినందుకు శ్రీసత్యసాయి జిల్లాలో ఎంపిగా బికె పార్ధసారధి, కర్నూలు జిల్లా పార్లమెంట్ సభ్యులు నాగరాజు, కురబ కులస్తులకు పెద్దపీట వేసినందుకు శ్రీనారా చంద్రబాబు నాయుడు, లోకేష్‌బాబు, కొణిదెల పవన్ కళ్యాణ్కు కరుబ సంఘం తరపున పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి జిల్లా కురుబ సంఘం సభ్యులు సామకోటి ఈశ్వరయ్య, కిష్టా, కేశం, నాగరాజు, మల్లప్ప, మహేష్, మంజునాధ్, వాసు, తదితరులు కురుబ సంఘం సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాల పంపిణీ

-మండలంలో 84 పాఠశాలలు-8889 మంది విద్యార్థులు

-ఇస్కాన్ అక్షయపాత్ర ద్వారా II పాఠశాలలకు మధ్యాహ్న భోజనం పంపిణీ



ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు సరఫరా చేస్తున్న దృశ్యం

**కళ్యాణదుర్గం, జూన్ 13 ప్రభాతవార్త**

కళ్యాణదుర్గం మండలంలో 84 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, మొత్తం 8889 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని ఎంఇఓలు విజయలక్ష్మి-1, ఎంఇఓ-2 బాబులు తెలిపారు. గురువారం వారు ప్రభాతవార్తతో మాట్లాడుతూ విద్యాకానుకకు బదులుగా ఈ సంవత్సరం కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో స్టుడెంట్స్ కిట్ల రూపంలో పాఠ్యపుస్తకాలు, స్కూలు బ్యాగులు, యూనిఫాంలతో కూడిన కిట్లు విద్యార్థులకు అందజేస్తున్నట్లు వివరించారు. ఈ సంవత్సరం నుండి 1,2 తరగతి విద్యార్థులకు విద్యాప్రవేశ్ పథకం కింద విద్యపట్ల అసక్తి పెంపొందించడంతో పాటు ఫిజికల్ యాక్టివిటీస్‌లో 9 మాసాలపాటు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కాగా ఇస్కాన్ సంస్థ అక్షయ పాత్ర ద్వారా ప్రస్తుతం 11 ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే మధ్యాహ్న భోజనం సరఫరా సాగుతోందని, మరో 35 పాఠశాలలకు విస్తరించాలని ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. అంతేకాకుండా కళ్యాణదుర్గం మున్సిపాలిటీతో పాటు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామీణ ప్రాంతాలకు అక్షయపాత్ర సేవలు విస్తరించాలనే ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. కాగా విద్యాసంవత్సరవం ప్రారంభం కావడంతో మండలంలోని 84 పాఠశాలల్లోని 8889 మంది విద్యార్థులకు వివిధ టైటిల్స్ కింద 42వేల పాఠ్యపుస్తకాలు అవసరం ఉండగా ఇప్పటివరకూ 30వేల టైటిల్స్ పుస్తకాలు వచ్చాయని, ఇంకా 12వేల పాఠ్యపుస్తకాలు అందాల్సి ఉందన్నారు. వచ్చిన పాఠ్యపుస్తకాలను మండల వ్యాప్తంగా ఉన్న పాఠశాలలకు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## ప్రపంచ రక్తదాతల దినోత్సవం విజయవంతం చేయండి



చల్లా కిషోర్ చౌదరి

**కళ్యాణదుర్గం టౌన్, జూన్ 13 ప్రభాతవార్త**

ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు అందరు తప్పకుండా 3 నెలలకోసారి రక్తదానం చేయొచ్చు అని రాష్ట్ర ఉత్తమ సామాజిక సేవా అవార్డు గ్రహీత చల్లా కిషోర్ చౌదరి పేర్కొన్నారు. రక్తదానం చేసి ప్రాణదాతలు కండి, ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రక్తదానంపై అవగాహన కల్పించారు. యువకులకు ఉన్న అపోహలు తొలగించు కొని ఆరోగ్యవంతమైన వారందరు ప్రతి వారు మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయొచ్చు అని చల్లా అన్నారు. స్థానిక చల్లా కాంప్లెక్స్‌లో జరిగిన సమావేశంలో గర్భిణీ స్త్రీలకు, ప్రమాదంలో ఉన్న వారికి రక్తం దానం చేయాలని కోరారు. చల్లా కిషోర్ చౌదరి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు లింగ ప్రసాద్, వినియోగదారుల సంఘాల సమాఖ్య గౌరవ అధ్యక్షులు చల్లా రాజశేఖర్‌చౌదరి, మధర్ థెరిస్సా మహిళా సంఘ అధ్యక్షురాలు, సెలీన చౌదరి, డాక్టర్ హర్షిణి, నివేదిత చౌదరి, ఓబుళరాజు, ఫిజికల్ డైరెక్టర్ కిరణ్ చౌదరి, కరణం మల్లికార్జున బాబు, రోజ్లీ రాజేష్, నవీన్ నిశ్చల్, బాబా, ప్రెస్కిల్లా తదితరులు పాల్గొన్నారు.

## మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ



మలేరియా వ్యతిరేక మాసోత్సవం ర్యాలీ దృశ్యం

**ఉరవకొండ, జూన్ 13 ప్రభాతవార్త**

దోమలు ప్రజారోగ్యానికి ప్రధాన శత్రువులని ఉరవకొండ డివిజన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి బి.కోదండరామిరెడ్డి అన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా గురువారం ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్, సిబ్బందితో కలిసి ఆయన అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బి.కోదండరామిరెడ్డి మాట్లాడుతూ ప్రతిరోజూ వర్షాలు అధికంగా కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు రాకుండా గ్రామ పంచాయతీ సహాయ సహకారాలతో వైద్య ఆరోగ్య సిబ్బంది మమేకమై ప్రణాళిక బద్ధంగా ప్రతి శుక్రవారం డ్రై డేను నిర్వహించడం జరుగుతోందన్నారు. పట్టణంలోని మురుగునీటి నిల్వలవద్ద ఆయిల్ బాల్స్ వేయడమే కాకుండా దోమల నివారణపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. డ్రై డేను పకడ్బందీగా నిర్వహించడంపై పట్టణంలోని ఐదు సచివాలయాల సిబ్బందికి పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్‌తో కలిసి సూచనలందించారు.

## బాల కార్మికల వ్యవస్థ నిర్మూలనకు కఠిన చట్టాలను తీసుకురావాలి



బిఎం.నాదల్ ఫైల్‌ఫోటో

**రాయదుర్గం రూరల్, జూన్ 13 ప్రభాతవార్త:**

బాలకార్మిక వ్యవస్థ కొనసాగడానికి పేదరికం ప్రభుత్వ విద్యా ఆరాకొర సదుపాయాలు మరియు ఉపాధ్యాయుల కొరత, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం కఠిన చట్టాలను తీసుకురావాలని సామాజిక కార్యకర్త బిఎం.నాదల్ అన్నారు. గురువారం ప్రపంచ బాలల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆయన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ పిల్లల జీవితాలను, సామాజిక పరిస్థితులను బాల కార్మిక వ్యవస్థ ప్రభావితం చేస్తుందన్నారు. ప్రపంచంలో అత్యధిక సంఖ్యలో బాల కార్మికులు ఉన్న దేశం భారతదేశమని, ప్రతి 11మంది పిల్లల్లో ఒక్కరు పనిలో కొనసాగుతున్నారని తెలిపారు. పాఠశాల అందుబాటులో ఉన్న విద్యా వ్యాయం భరించలేకపోవటం, బడుల్లో ఎదురయ్యే వివక్ష, లింగ దుర్విచక్షణ వేధింపులు వంటి కారణాలతో ఎక్కువ మంది బాలలు చదువును మధ్యలోనే వదిలేస్తున్నారన్నారు. అధికారులు బడి పిలుస్తోంది వంటి కార్యక్రమాలతో చదువు వదులుకున్న బాల విద్యార్థులను చదువు విలువలు వంటివి తెలిపి బడికి రప్పించాలని ఆయన కోరారు.

## వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

- కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కోరి నాగరాజు



కోరి నాగరాజు ఫైల్‌పోటో

**కణేకల్లు, జూన్ 13 ప్రభాతవార్త:**

వాల్మీకులను బిసిల నుంచి ఎస్టీలుగా మార్చాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కోరి నాగరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ వాల్మీకులు అయినటువంటి శాసనసభ్యులైనటు వంటి కాలువ శ్రీనివాసులు, గుమ్మనూరు జయరాం ఆంధ్ర ప్రదేశ్లో చాలా మంది వాల్మీకులు ఉన్నారు. అయితే ఏ రాజకీయ నాయకున్ని అయిన వాల్మీకి సోదరులు అందరూ అడిగేది ఒకటే పక్కన రాష్ట్రం కర్ణాటక అయినటు వంటి రాష్ట్రంలో వాల్మీకులు బీసీగా ఉంటే ఎస్టీగా చేర్చారని, మన ఆంధ్రప్రదేశ్లో మాత్రం ఎంతమంది రాజకీయ నాయకులు ఉన్న మన వాల్మీకులను బిసి నుంచి ఎస్టీలుగా ఎవరు చయలేకపోయారని ఆవేదన వ్యక్తపరిచారు. పార్టీలకు అతీతంగా అన్ని పార్టీలో ఉన్న వాల్మీకులు అంతా కలిసికట్టుగా ఏకతాటిపైకి వచ్చి వాల్మీకులను ఎస్టీజాబితాలో చేర్చేందుకు ఒక ప్రణాళిక తయారు చేయాలన్నారు. వాల్మీకులను బీసీలు నుంచి ఎస్టీలుగా చేర్చే విధంగా కేంద్రం దృష్టికి శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు, గుమ్మనూరు జయరాంలు తీసుకెళ్లి వాల్మీకులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## తెదేపా సంబరాలు

**డి.హీరేహాళ్, జూన్ 13 ప్రభాతవార్త:**



కేక్‌కట్ చేస్తున్న తెలుగు తమ్ముళ్లు

మండల పరిధిలోని మలపనగుడి గ్రామంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి కాలవ శ్రీనివాసులు అత్యధిక మెజార్టీతో రాయదుర్గం ఎమ్మెల్యేగా గెలుపొందంతో తెలుగు తమ్ముళ్ల గురువారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో తెదేపా అనంతపురం అధ్యక్షులు నాగల్లి రాజు, తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ హనుమంతరెడ్డి తదితరులతో కలిసి కేక్ కట్‌చేసి మిఠాయిలు తినిపించుకున్నారు. రాయదుర్గం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు అధ్యతిక మెజార్టీ సాధించడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేసి బాధ్యత తీసుకొన్న శుభసందర్భంగా వారు ఈ సంబరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యను అందించడమే గురుతర బాధ్యత



విద్యార్థులను ఆశీర్వదిస్తున్న ఉపాధ్యాయులు

**డి.హీరేహాళ్, జూన్ 13 ప్రభాతవార్త:**

విద్యార్థులకు నాణ్యతతో కూడిన నైపుణ్యమైన విద్యను అందించడమే గురువుల బాధ్యతఅని శిష్యులు, గురువుల మధ్య గురుతర బాధ్యత ఎంతో అవసరమని బాల మేధావి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల కరెస్పాడెంట్ వన్నూరుస్వామి పిలుపునిచ్చారు. గురువారం ఈ విద్యా సంవత్సరంకు విద్యా సంస్థలు పునఃప్రారంభం కావడంతో డి.హీరేహాళ్ మండలంలోని కల్యం గ్రామంలోని బాల మేధావి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు మొదటిరోజు పాఠశాల ప్రారంభం స్వాగతం పలికారు. ఈ కార్యక్రమాన్ని ఆ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఘనంగా నిర్వహించి విద్యార్థులను ప్రత్యేకంగా ఆశీర్వదించారు. ఈ పాఠశాల కరెస్పాడెంట్ ఆధ్వర్యంలో పాఠశాల రీ ఓపెనింగ్ మొదటి రోజు కార్యక్రమంను విద్యారఉ్థుల చేత రిబ్బన్‌కట్ చేయించి ఈ విద్యా సంవత్సరాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపాధ్యాయులు చేత హారతి ఇచ్చి అక్షంతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సువార్త సభలను జయప్రదం చేయండి



గోడపత్రికలు విడుదల చేస్తున్న పాస్టర్లు

**గుమ్మఘట్ట, జూన్ 13 ప్రభాతవార్త:**

కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కుందుర్పి మండల కేంద్రంలో గురువారం బిలివర్స్ ఇస్టరన్ చర్చిలో పాస్టర్లు సువార్త సభల నిమిత్తం ఏర్పాటు చేసిన ప్రార్ధన సమావేశంలో సువార్త సభల గోడపత్రికలను గురువారం విడుదల చేశారు.

ఈ సమావేశంలో తాలుకా పాస్టర్ల అసోషియేషన్ అధ్యక్షులు చల్లా కిషోర్‌కుమార్ చౌదరి, పాస్టర్ సబవరాజులు మాట్లాడుతూ ఈ నెల 17,18,19వ తేదీలల్లో కళ్యాణదుర్గంలోని దొడగట్ట రోడ్డు వద్ద ఉన్నమార్కెట్‌యార్డులో సువార్త సభలు జరుగుతున్నాయన్నారు. ఈ సభలకు అంతర్జాతీయ సువార్తికులు గుంటూరు దీవెనయ్య హాజరై బైబిల్ సందేశాలు, విశ్వాసులు, భక్తులకు అందిస్తారని తెలిపారు. ఈ ప్రాంతం నుండి ఎక్కువ సంఖ్యలో పాల్గొనాలని, అలాగే దైవాసేవకులు మన ప్రాంతం అభివృద్ధి కోసం రైతులకు మంచి వర్షాలు, వేసిన పంటలో మంచి దిగుబడి, మంచి ధర, అభివృద్ధి, ప్రపంచంలో శాంతి కోసం ప్రత్యేక ప్రార్ధనలు చేస్తారని తెలిపారు. ఈ సమావేశంలో పాస్టర్ బసవరాజు, పాస్టర్ విజయకుమార్, పాస్టర్ రాజేష్, పాస్టర్ సల్మాన్, రవికుమార్, స్వరూప్ కుమార్, రోజ్లీ రాజేష్, జోసెఫ్ కిశోర్, జాన్‌బాబు, దేవరాజు, జాన్‌పాల్, ఓబద్య తదితరులు పాల్గొన్నారు.

03ATP13_03ATP13.qxd 13-06-2024 PM 11:38 Page 1



# నోబెల్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చిన్నారి క్రిస్టినా సియారా పేరు నమోదు

## - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కలెక్టరేట్, జూన్ 13 ప్రభాతవార్త

నోబెల్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో చిన్నారి క్రిస్టినా సియారా పేరు నమోదు చేయడం జిల్లాకు ఎంతో గర్వకారణమని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణం మోదీనాబాద్‌కు చెందిన ఎలక్ట్రికల్ శాఖ రైల్వే ఉద్యోగి పి.సుధాకర్ 4 నెలల చిన్నారి క్రిస్టినా సియారా ఫ్లాష్ కార్డ్‌లను (అల్ఫాబిట్స్, అనిమల్స్, ఫ్రూట్స్, బర్డ్స్ లాంటివి) గుర్తించడంలో అతి చిన్న వయసు కలదిగా నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో పేరు నమోదు చేసింది. గురువారం అనంతపురం కలెక్టరేట్‌లోని జిల్లా కలెక్టర్ చాంబర్‌లో చిన్నారి క్రిస్టినా సియారాతో కలిసి తల్లిదండ్రులు జిల్లా కలెక్టర్‌ను కలిశారు. చిన్నారిని వెరీ గుడ్ అంటూ జిల్లా కలెక్టర్ అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారిని సాధారణ అమ్మాయిలా పెంచాలని తల్లిదండ్రులకు సూచించారు. చిన్నారికి ఎంతో ప్రతిభ వుందని భవిష్యత్తులో కూడా చిన్నారికి ప్రోత్సాహం అందించాలన్నారు. చిన్నారి తల్లిదండ్రులు మాట్లాడుతూ 149 ఫ్లాష్ కార్డ్‌లను గుర్తించి నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో చిన్నారి క్రిస్టినాసియారా పేరు నమోదు చేసిందన్నారు. ఇంతకుముందు కర్ణాటకకు చెందిన పాప 125 ఫ్లాష్ కార్డ్‌లను గుర్తించిందని ఆ పాప రికార్డును చిన్నారి బ్రేక్ చేసిందని తెలిపారు. ఈ నెల 7వతేదీన చిన్నారి 3 నెలల 15 రోజుల వయసులో వరల్డ్ రికార్డు నెలకొల్పిందని నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు నుండి సర్టిఫికెట్ రావడం జరిగిందన్నారు. చిన్నా రిని అభినందించిన కలెక్టర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.



చిన్నారిని అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

# వేరుశనగ విత్తన శుద్ధి, ఎరువుల యాజమాన్యంపై అవగాహన

## - వ్యవసాయ అధికారి లోకేశ్వర్‌రెడ్డి

నంబులపూలకుంట, జూన్ 13, ప్రభాతవార్త:

మండల కేంద్రానికి చెందిన రైతు రమణారెడ్డి పొలంలో వేరుశెనగ విత్తన శుద్ధి, ఎరువుల యాజమాన్యంపై మండల వ్యవసాయ అధికారి వి. లోకేశ్వంరెడ్డి గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా 1 కెజి వేరుశనగ విత్తనానికి 3గ్రామ్‌ల మాంకోజెబ్ మరియు 8 గ్రామ్ ట్రైకోడెర్మా విరిడి పొడి మందును పట్టించాలి, అలాగే కాండం కుళ్ళు, వైరస్ తెగులు మరియు వేరుపురుగు ఆశించే పొలాలలో 1 కెజి విత్తనానికి 2ఎంఎల్ ఇమిడాక్లోప్రిడ్ మరియు 4ఎంఎల్ క్లోరోఫైరిపాస్ కలిపి విత్తుకోవాలన్నారు.

విత్తనానికి మొదట క్రిమి సంహారక మందుతో శుద్ధిచేసి నీడలో ఆరబెట్టిన తర్వాత శిలీంద్రానాశినితో శుద్ధిచేయాలన్నారు. ఎరువల యాజమాన్యం గురించి విరిస్తూ దుక్కిలో ఎకరానికి 4-5 టన్నుల సేంద్రియ ఎరువు వేయాలనీ, భాస్వరం 100 కెజిఇ, సింగిల్ సూపర్ ఫాస్పెట్ మరి యు 30 కెజిల పోటాష్‌ని, అఖరి దుక్కిలో వేసుకోవాలన్నారు. అలాగే వేరుశనగ వర్షధారపు పంట క్రింద 18 కెజి యూరియాని విత్తే సమయంలో వేసుకోవాలన్నారు. అలాగే ప్రతి 3 పంటలకు ఒక సారి 20కెజిల జింక్ సల్ఫేట్ వే యాలని, విత్తన 30-45 రోజుల మధ్య 2వ సారి కలపు తీసే సమయంలో 200 కెజీల జిప్సం వేసి తవ్వితే కాయలు అభివృద్ధి చెందే పొరల్లో పడుతుందనీ, దీని వలన కాయ నాణ్యత, నూనే శాతం పెరిగి 16-17 కి ్వంటాల మంచి దిగుబడి అందుతుందన్నారు. ఈ కార్యక్ర ్మంలో ఏఈఓ శిరీష, అగ్రికల్చర్ అసిస్టెంట్ యుగం ధర్, ధనలక్ష్మి, హరి, రైతులు పాల్గొన్నారు.



రైతు పొలంలో విత్తన శుద్ధి నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారి

# మెగా డిఎస్‌సిపై మొదటి సంతకం చేసిన సియం చంద్రబాబు నాయుడు

## - డిఎస్సి అభ్యర్థులు ధన్యవాదాలు

తనకల్లు, జూన్ 13, ప్రభాతవార్త:

గత ప్రభుత్వంలో డిఎస్సి చేసిన అభ్యర్థులు ఎన్నో పోరాటాలు చేసినా కనీసం చలనం లేకపోవడంతో జగన్‌మోహన్‌రెడ్డి ఒక్క డిఎస్సి పోస్టును కూడా భర్తీ చేయలేదని మండల టిడిపి యువత అధ్యక్షులు కావాడి ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి నాగేంద్రప్రసాద్ విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ తరుణంలో అభ్యర్థులు అందరికీ అండగా ఉంటానని చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు మాట ఇవ్వడం జరిగింది. ఆ మాట నిలబెట్టుకుంటూ నేడు 163 47 డిఎస్సి పోస్టులు భర్తీకి మొదటి సంతకం చేయడం చాలా ఆనందకరం అన్నారు. అలాగే ప్రజలు ఇచ్చిన హామీ మేరకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై రెండో సంతకం, పెన్ష న్ల పెం పుపై మూడో సం తకం, అన్నా క్యాం టీన్ల పున రుద్దర ణపై నాలుగో సంతకం, స్కిల్ సెన్సె స్( గణన)పై ఐదో సంతకం చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు తెలుగు యువత తరుపున ధన్యవా దాలు తెలియజేస్తున్నామన్నారు.



నాగేంద్రప్రసాద్



కావాడి ప్రవీణ్‌కుమార్

# పవన్ కళ్యాణ్‌ను కలిసిన అంకె ఈశ్వరయ్య

అనంతపురం, జూన్ 13 ప్రభాతవార్త బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన జనసేన అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్‌ని మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసిన జనసేన పార్టీ ఉమ్మడి అనంతపురం జిల్లా ఉపాధ్యక్షులు అంకె ఈశ్వర య్య శుభాకాంక్షలుతెలి యజేయడం జరిగింది. అనంతపురం జిల్లాలోని రాజకీయ పరిస్థితులను పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకురావడం జరిగింది.



ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న దృశ్యం

# మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు శుభాకాక్షలు తెలిపిన జిల్లా టిడిపి అధికార ప్రతినిధి

అనంతపురం అర్బన్, జూన్ 13 ప్రభాతవార్త

ఇటీవల జరిగిన సత్యకుమార్ జిల్లా ధర్మవరం నియోజకవర్గం నుంచి శాసనసభ ఎన్నికల్లో ఎన్డిఏ కూటమి అభ్యర్థిగా పోటీ చేసి అఖండ మెజార్టీతో విజయం సాధించి ఎన్డీఏ ప్రభుత్వంలో మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సత్యకుమార్ యాదవ్‌ను అనంతపురం జిల్లా టిడిపి అధికార ప్రతినిధి సరిపూటి రమణ గురువారం అమరావతి సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి అనంతపురం జిల్లాకు మంత్రి మ ండలిలో సముచత స్థానం కల్పించడం పట్ల చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రంలో మరోసారి రాష్ట్ర ప్రజల అందరి ఆదరాభిమానాలతో చంద్రబాబునాయుడు నాలుగవ సారి ముఖ్యమంత్రి కావడం అభినందనీయమన్నారు. ఆయన వెంట టిడిపి నాయకులు గోనుగుంట్ల అమర్‌నాథ్‌చౌదరి, కాకర్ల సురేంద్ర లింగం నాయుడు, సాయినాథ్, బాబు హాజరయ్యి అభినందనలు తెలియజేశారు.

# పోలీసు స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

## శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా నిరంతరం అప్రతమతంగా ఉండండి

## - జిల్లా ఎస్పీ గౌతమిశాలి



ఆకస్మికంగా స్టేషన్‌లోకి వెళ్తున్న ఎస్పీ



పోలీస్‌స్టేషన్‌లో అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ

అనంతపురం, జూన్ 13 ప్రభాతవార్త బ్యూరో

.తాడిపత్రి పట్టణం, పరిసర మండలాల్లో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ గౌతమిశాలి ఆదేశించార. తాడిపత్రి అర్బన్, రూరల్ యుపిఎస్ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలింగు రోజు, ఆ తర్వాత తాడిపత్రి ప్రాంతంలో చెలరేగిన ఘర్షణలు, అల్లర్లకు సంబంధించిన కేసులను సమీక్షించారు. పగలు, రాత్రివేళల్లో నిర్వహించే బీట్స్ పెంచాలన్నారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ పీటర్లు, ట్రబుల్ మాంగర్స్‌పై గట్టి నిఘా వేయాలన్నారు. ప్రజలు ప్రశాంతంగా జీవించేలా పరిస్థితులు కొనసాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాడిపత్రి డిఎస్పీ జనార్థన్‌నాయుడు, సిఐలు నాగేంద్ర ప్రసాద్‌లు ఎస్పీతోపాటు ఉన్నారు.

# చెప్పిన మాట ప్రకారం మెగా డిఎస్సీపైనే మొదటి సంతకం

## - నిరుద్యోగుల జీవితాలలో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి చంద్రబాబు

## - అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

అనంతపురం అర్బన్, జూన్ 13 ప్రభాతవార్త

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబునాయుడు మెగా డిఎస్సీ ఫైల్‌పై తొలి సంతకం చేసి నిరుద్యోగుల జీవితాల్లో భరోసా కల్పించారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ తెలిపారు. మెగా డిఎస్సీ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో 16,347 పోస్టులకు పచ్చజెండా ఊపారన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయంపై రాష్ట్ర వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయన్నారు. మెగా డిఎస్సీ ద్వారా అంచనాలకు మించిన పోస్టులు ప్రకటించారన్నారు. మెగా డిఎస్సీ కాదు మెగా డిఎస్సీ ప్లస్ అనిపించేలా 16,347 పోస్టుల ఫైల్స్‌పై తొలి సంతకం చేశారని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ ఇవాళ బాధ్యతలు స్వీకరించిన వెంటనే మెగా డిఎస్సీ ఫైల్‌పైన తొలి సంతకం చేశారన్నారు. ఏపి ల్యాండ్ టైటిలింగ్ యార్డు రద్దు ఫైల్‌పై రెండో సంతకం, సామాజిక పింఛన్లు రూ.4వేలకు పెంపు దస్త్రంపై మూడో సంతకం, అన్నా క్యాంటీన్ల పునరుద్దరణపై నాలుగు, నైపుణ్య గణనపై ఐదో సంతకం చేయడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు.

# ఉత్తర కన్నడ జిల్లాలో అక్రమంగా పశువుల రవాణా :ఇరువురి అరెస్టు

ఉత్తరకన్నడ, జూన్13, ప్రభాతవార్త ప్రతినిధి : ఉత్తరకన్నడ జిల్లా భట్కళ్ తాలూకాలో గురువారం అక్రమంగా కబేలాలకు తరలిస్తున్న 25పశువులను పోలీసులు రక్షించి ఇరువురు దుండగులను అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు భట్కళ్ నుంచి కారవార మీదుగా మినీలారీలో పశువులు తరలి స్తుండగా పోలీసులు సోదాలు జరిపారు. సదరు పశువులను వేరేచోట కబేళాలకు తరలిస్తున్నారని సమాచారం అందటంతో ఇరువురు దుండగులు కిశన్ నాయక్, మహేష్‌లను అరెస్టు చేశారు. వాహనాన్ని పశువులను స్వాధీనం చేసుకున్నపో లీసులు దుండగులపైకేసు నమోదు చేశారు.

# గ్రామాల్లో శాంతిభద్రతలు లోపించకుండా చర్యలు చేపట్టండి

## -జిల్లా ఎస్పీ గౌతమిసాలి ఆదేశం

## -ఉరవకొండలో పోలీసు అధికారులతో సమీక్ష



డీఎస్పీ, సీఐ, ఎస్ఐ సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా ఎస్పీ గౌతమి సాలి

ఉరవకొండ, జూన్ 13 ప్రభాతవార్త

గ్రామాల్లో ప్రశాంతత లోపించకుండా, శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ గౌతమిసాలి ఆదేశించారు. గురువారం మధ్యాన్నం ఉరవకొండకు వచి ్చన ఎస్పీ స్థానిక రూరల్ పోలీస్ సర్కిల్ కార్యాలయంలో గుంతకల్లు డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి, ఉరవకొండ యుపీఎస్ సీఐ సురేష్‌బాబు, ఎస్ఐ రాఘవేంద్రప్ప సిబ్బందితో తాజా పరిస్థితులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర ్భంగా ఎస్పీ గౌతమిసాలి మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాలు, కాలనీలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తరచూ సందర్శించడమే కాకుండా నిరంతరం మొబైల్ పార్టీలచే పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. ఇంకా అవసరమనుకుంటే పికెట్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎవరైనా అల్లర్లు, విధ్వంసాలకు పాల్పడితే చట్టపరంగా గట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ గౌతమిసాలి మీడియాతో మాట్లాడుతూ సమస్యలు సృష్టించేవారిని బైండోవర్ చేయడం, చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని చూస్తే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

# కర్ణాటక వార్తలు

## కర్ణాటకలో ఒకేరోజు కలుషితనీరు సేవించి 7మంది మృతి :



ఆసుపత్రిలో అస్వస్థులను పరామర్శిస్తున్న జిల్లా మంత్రి డాక్టర్ జి.పరమేశ్వర.

తుమకూరు, జూన్13 ,ప్రభాతవార్త ప్రతినిధి : తుమకూరు, చిక్కబళ్లాపుర జిల్లాల్లో గురువారం సంభవించిన వేర్వేరు సంఘటనల్లో కలుషితమైన తాగునీరు తాగిన ఏడుగురు మృతి చెందారు. వివరాల్లోకి వెళితే తుమ కూరు జిల్లా మధుగిరి తాలూకా చెన్నేనహళ్లి గ్రామంలో జరిగిన జాతరలో పాల్గొన్న భక్తులు అక్కడ నీటిని సేవించి అస్వస్థతకు గురయ్యారు. సుమారు 110మంది ప్రజలకు కలుషితమైన నీరు సేవించటం వలన వాంతులు విరేచనాలు కాగా వారిలో తీవ్ర ంగా అస్వస్థతకు గురైన నలుగురిని తుమకూరు జిల్లా ఆసుపత్రిలో చేర్చగా అక్కడ ముగ్గురు మృతి చెందారు. జాతర సమయంలో ఊరిలో తాగునీరు సరఫ రా చేయగా ఆనీరు కలుషితమై అనేకమందికి వాంతులు విరేచనాలు అయ్యాయి. అంతకుముందు మధుగిరిలో 14మందికి పావగడలో 20మందికి చికిత్స ఇప్పించారు. ఓవర్‌హెడ్ ట్యాంకును శుభ్రం చేయకుండా నీటిని సరఫరా చేసిన వాటర్‌మెన్‌ను అక్కడి పంచాయతీ అభివృద్ధి అధికారిని మంత్రి జి.పరమేశ్వర గురువారం సస్పెండ్ చేశారు. ఆసుపత్రిలో చేరిన బాధితులను మంత్రి పరామర్శి ంచారు. కాగా మరోక సంఘటనలో చిక్కబళ్లాపుర జిల్లా వీరాపుర గ్రామంలో కలుషితమైన నీరు సేవించి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందారు. వీరాపుర గ్రామానికి చెందిన ముని నారాయణమ్మ, గంగమ్మ, లక్ష్మమ్మ, నరసింహప్ప మృతి చెందారు. వీరాపుర గ్రామానికి పక్కనే ఉన్న కోటగల్ గ్రామ పంచాయతీ నుంచి తాగునీరు సరఫరా అవుతోంది. ఇవాళకూడా ఇలా సరఫరా అయిన తాగునీటిని సేవించిన నలుగురు వృద్దులు వాంతులు విరేచనాల తో మృ తి చెందారు. గత వారంరోజులుగా ఈ గ్రామంలో ఇలాంటి కలుషిత నీరు సేవన సంఘటనలు వెలుగు చూసిన ఆరో గ్యశాఖ అధికారులు పట్టించుకోలేదని గ్రామ స్తులు ఆరోపించారు. ఇటీవల ఆర్డీపి ఆర్ మంత్రి ప్రియాంక్ ఖర్గే ఒక నోటీసు జారీ చేసి ఏదేని పంచాయతీలో కలుషి తమైన నీరు సరఫరా అయితే వాటికి ఆయా పంచాయతీల పిడిఓలు వాటర్‌మె న్లను బాధ్యులు చేసి శిక్షిస్తామని చెప్పారు.

## వచ్చే ఏడాది బెంగళూరులో ఇన్వెస్ట్ కర్ణాటక జిమ్ సమావేశాలు : 90కోట్లు విడుదల : కర్ణాటక మంత్రివర్గం తీర్మానాలు



మంత్రివర్గం సమావేశం తీర్మానాలను చెబుతున్న న్యాయశాఖ మంత్రి హెచ్‌కె.పాటిల్.

బెంగళూరు, జూన్13, ప్రభాతవార్త ప్రతినిధి : అంతర్జాతీయంగా పెట్టుబడులు ఆకర్షించేందుకు ఏటా కర్ణా టక ప్రభుత్వం నిర్వహించే గ్లోబల్ ఇన్వెస్టర్ మీట్ కోసం కర్ణాటక ప్రభు త్వం 90కోట్ల రూపా య లను విడుదల చేసింది. బెంగ ళూరులో గురువా రం ముఖ్యమంత్రి సిద్దరామ య్య అధ్యక్షతన జరిగిన కెబినెట్ సమావేశ ంలో చేసిన తీర్మానాలను న్యాయ శాఖ మంత్రి హెచ్‌కె.పాటిల్ విలేకరుల సమావే శంలో తెలిపారు. ఇన్వెస్ట్ కర్ణాటక పేరిట వచ్చే ఏడాది ఫిబ్రవరి 14నుంచి 16వరకు బెంగళూరు ప్యాలస్ మైదానంలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్ జరుగుతుందని చెప్పా రు. వీటి నిర్వహణకు సర్కారు 90కోట్లు విడుదల చేసిందన్నారు. ఇన్వెస్ట్ కర్ణాటక సమావేశాలకు అంత ర్జాతీయంగా పలు ఐటీబీటి కంపెనీలను ఇన్వెస్టర్లను రప్పిం చేందుకు గాను బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ సంస్థను తన రాయభారిగా నియ మించింది. ఇందుకు వారికి 21కోట్లు రూపాయలను సర్కారు చెల్లిస్తుందని చెప్పా రు. కర్ణాటక ప్రజలందరికి సర్కారు పరిపాలన అందుబాటులో ఉండేలాగా గుడ్ గవర్నెన్స్ అందించేందుకు సిఎం మంత్రుల సహకారం కోరారు. జనతాదర్శన్ మాదిరిగా వివిధ జిల్లాల్లోను సభలు నిర్వహించి ప్రజల సమస్యలకు స్థలంలో పరిహారం అందించేలా ఏర్పాట్లు చేయాలని సూచిం చారు. వీటి ద్వారా సర్కారు పరిపాలన ప్రజల చెంతకు తీసుకువెళ్లేందుకు సాధ్యపడుతుందని సిఎం చెప్పార న్నారు. వీటిలో అధికారులను మమేకం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్య కార్యదర్శికి సిఎం సూచిం చారు. వాయవ్య కర్ణాటక, ఆగ్నేయ కర్ణాటక ఆర్టీసిలో 46.68కోట్ల రూపాయలతో కొత్తగా వేగదూత బస్సులను కొనుగోలు చేసేందుకు కెబినెట్ అనుమతి ఇచ్చింది పైరెండు విభాగాల్లో కొత్తగా 112బస్సులు ప్రవేశపెడ తారని చెప్పారు. కోలారు గోల్డ్‌ఫీల్డ్స్ లోని వ్యర్థపదార్థాలను డంప్ చేసిన భూము లను కేంద్రానికి అప్పగించాలన్న ప్రతిపాదనలను మంత్రివర్గం అంగీకరించలేదు. వీటిపై మరోసారి సమగ్రంగా చర్చించి నిర్ణయం తీసుకోవాలని సిఎంను కోరింది.

## అభిమానిని హత్య చేయించిన దర్శన్‌ను ఉరితీయాలి : రాజ్యరైతుసంఘం డిమాండ్ :

మండ్య, జూన్13, ప్రభాతవార్త ప్రతినిధి : తన ప్రేయసికి మేసేజుల ద్వారా లైంగిక వేధింపులు చేశాడని అభిమానిని హత్య చేయించిన కన్నడహీరో దర్శన్ అతడి అనుచరులను ఉరితీయాలని డిమాండ్ చేస్తూ కర్ణాటక రాజ్యరైతు సంఘం గురువారం మండ్యలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించింది. అక్కడి విశ్వేశ్వరయ్య సర్కిల్ నుంచి సంజయ్ సర్కిల్ వరకు వేలది మంది రైతులు మహిళలతో భారీ ఎత్తున ఊరేగింపు నిర్వహించి దర్శన్ అరెస్టుకు డిమాండ్ చేసింది. దర్శన్ మండ్య జిల్లా నివాసి కావటం ఆయన తన అభిమానులను చులకనగా చూసి హత్య చేయించే వరకు వెళ్లటాన్ని ఈ జిల్లా వాసులు నమ్మలేకపోతున్నారు. తమ జిల్లా సినీహీరో ఇలాంటి పాశవిక సంఘటనలో భాగస్వామి కావటం వలన అతడిని అతడి అనుచరులను కఠినంగా శిక్షించాలంటూ ప్రజలు వీధుల్లోకి వచ్చారు. ఇకమీదట కర్ణాటకలో ఏ సినీహీరో ఇలాంటి దారుణకృత్యాల్లో పాల్గొనకుండా బుద్ధి చెప్పేందుకుగాను సర్కారు దర్శన్‌ను కఠినంగా శిక్షించాలని కోరారు. ఆతరువాత రైతుసంఘం పదాధికారులు జిల్లాధికారికి మనవి పత్రం అందచేశారు.

## హాసన్ జిల్లాలో గ్యాస్ ట్యాంకర్ బోల్తా : శిరాడీఘాట్‌లో నిలిచిపోయిన వాహనాలు

హాసన్, జూన్13, ప్రభాతవార్త ప్రతినిధి : హాసన్ జిల్లా సకలేశపుర రహదారిలో గురువారం ఉదయం ఒక గ్యాస్‌ట్యాంకర్ అదుపుతప్పి రోడ్డుపైన బోల్తా కొట్టి ంది. మంగళూరు ఆయిల్ గ్యాస్ రిఫైనరీ నుంచి వంట గ్యాసును నింపుకుని బెంగ ళూరు వైపునకు వస్తున్న బుల్లెట్ గ్యాస్ ట్యాంకర్ బోల్తా కొట్టడంతో శిరా డీఘాట్ రహదారిలో కిలోమీటర్ల వరకు వాహనాలు ఎక్కడివక్కడె నిలిచిపో యి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. అగ్నిమాపక సిబ్బంది స్థలానికి భారీ క్రేన్‌తో తరలివెళ్లి గ్యాస్ ట్యాంకర్‌ను పైకి లేవనెత్తే పనిలో నిమగ్నం అయ్యారు. గ్యాస్ ట్యాంకర్ నుంచి ఎలాంటి లీకేజి కాకపోవటంతో అక్కడి ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ఆస్తి నష్టం జరగలేదని పోలీసులు తెలిపారు.

# ఎత్తినహొళె ప్రాజెక్టుకు అవసరమైన 500ఎకరాల భూములు సేకరిస్తాం : డికె.శివకుమార్



గురువారం ఎత్తినహొళె ప్రాజెక్టు గురించి విలేకరులకు చెబుతున్న జలవనరులశాఖ మంత్రి డికె.శివకుమార్ తదితరులు

బెంగళూరు, జూన్13, ప్రభాతవార్త ప్రతినిధి : పశ్చిమకనుమల నుంచి కోలారు చిక్కబళ్లాపుర జిల్లాలకు సాగునీరు తాగునీరును అందించే ఎత్తినహొళె ప్రాజెక్టులో తుమకూరు చిక్కబళ్లాపుర జిల్లాలోని సుమారు 240కిలోమీటర్ల పరిధిలో ఎత్తిన హొళె కాలువలకు అవసరమై న 500 ఎకరాల ఫారెస్టు భూములను సేకరించేందుకు సర్కారు అన్ని ఏర్పాట్లు చేస్తుందని జలవనరుల శాఖ మంత్రి డికె.శివకుమార్ చెప్పారు. ఆయన గురువారం బెంగళూరు విధానసౌ ధలో ఎత్తిన హొళె ప్రాజెక్టు జారీలో ఉన్న అడ్డంకుల గురించి అటవీశాఖ మంత్రి ఈశ్వరఖండ్రె ఇతర ఉన్నతాధికారులతో సమావేశమై చర్చించారు. ఇప్పటికే ఈప్రా జెక్టులో జీరో నుంచి 40కిలోమీటర్ల వరకు కాలువ పనులు పూర్తి అయ్యాయని చెప్పారు. సదరు 40కిలోమీటర్ల వరకు టెస్టింగ్ కోసం ఈ వర్షాకాలంలో ఎత్తిన హొళె ప్రాజెక్టులో నీటిని ప్రవహింప చేస్తామని మంత్రి చెప్పారు. అక్కడ నుంచి 240 కిలోమీటర్ల వరకు సుమారు 45చోట్ల అటవీ భూములను సేకరించాల్సి ఉందన్నారు. ఇందుకు 500ఎకరాల భూములు కావాలి. అటవీశాఖ ఈభూ ముల ను ఇచ్చేందుకు సిద్దంగా ఉంది. దీనికి బదులుగా రెవె న్యూశాఖ భూములను అట వీ శాఖకు ఇస్తామని శివకుమార్ చెప్పారు. ఎత్తిన హొళె ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతులకు ఇప్పటికే పది కోట్ల రూపాయల పరిహారం చెల్లించాము మరో 40 కోట్ల రూపాయలను త్వరలో చెల్లిస్తామని చెప్పారు. ఈప్రాజెక్టు బెంగ ళూరు గ్రామీణ జిల్లా దొడ్డబళ్లాపుర తాలూకా మీదుగా చిక్కబళ్లాపుర జిల్లాకు వెళుతుంది. ఈమధ్యలో దొడ్డబళ్లాపుర తాలూకా దొడ్డ కల్కెరె గ్రామం వద్ద బ్యాలెన్సి ంగ్ రిజర్వాయర్ నిర్మించేందుకు సర్కారు అన్ని ఏర్పాట్లు చేస్తుందని తెలి పారు. ఈఏ డాదిలోగా ఈ ప్రాజెక్టుకు అవసరమైన అటవీ భూములను కేంద్ర సర్కారు నుంచి అనుమతి తీసుకునేందుకు ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సాయంతో ఢిల్లీలో కేంద్రసర్కారుకు మనవి చేసి అనుమతులు పొందుతామని చెప్పారు.

## పోక్సో కేసులో యడ్యూరప్ప అరెస్టుకు వారంట్ జారీచేసిన బెంగళూరు కోర్టు:



మాజీ సిఎం యడ్యూరప్ప

బెంగళూరు, జూన్13, ప్రభాతవార్త ప్రతినిధి : పోక్సో కేసులో కర్ణాటక మాజీ సిఎం యడ్యూర ప్పను అరెస్టు చేసేందుకు పోక్సో కేసుల బెంగళూరు ప్రత్యేక న్యా యస్థానం గురువారం వారంట్‌ను జారీచేసింది. ఇప్పటికే ఈకేసులో సిఐడి పోలీసులు యడ్యూరప్పను విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేయగా ఆయన తనకు వారం పాటు గడువు కావాలని కోరటంతో సిఐడి పోలీసులు వేరే దారిలేక కోర్టునతతు ఆశ్రయించారు. దీంతో బెంగళూరు ప్రత్యేక న్యాయస్థానం ఇవాళ సాయంత్రం ఆదేశాలు చేసి యడ్యూరప్ప అరెస్టుకు నాన్‌బె యిలబుల్ వార ంట్ ఇచ్చింది. ఇపుడు యడ్యూరప్ప ఢిల్లీలో ఉన్నారు.

తన అరెస్టు గురించి కర్ణాటక పోలీసులు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారన్న సమాచారం అందటంతో యడ్యూ రప్ప బుధవారం ఢిల్లీకు వెళ్లి అక్కడ కేంద్రమంత్రుల సాయం అభ్యర్థి స్తున్నా రు. ఈలోగా ప్రధాని మోదీ ఇటలీ పర్యటనకు వెళ్లటంతో వేరే మంత్రులను కలుసుకునే బిజీలో యడ్యూరప్ప ఉండిపోయారు. తన కూతురుకు ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ ఒక మహిళ యడ్యూరప్ప నివాసం డాలర్స్ కాలనీకు వెళ్లగా అక్కడ యడ్యూరప్ప సదరు మహిళ కూతురుతో మాట్లాడుతానని చెపుతూ 17 సంవత్సరాల యువతిని తన గదిలోనికి తీసుకువెళ్లి అక్కడ ఆ యువతిపై లైంగిక దౌర్జన్యం జరిపారని బెంగళూరు సదాశివనగర పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఈ కేసును పోక్సో కేసుగా నమోదు చేసుకోవటంతో యడ్యూ రప్పకు గడ్డు కాలం ఏర్పడింది.

## మైసూరులో ఇళ్లచోరీలు :లక్షలాది రూపాయల నగలు దోచుకున్న దుండగులు

మైసూరు, జూన్ 13, ప్రభాతవార్త ప్రతినిధి : మైసూరు పట్టణంలో గురువారం వేకువ జామున దేవరాజ మొహల్లాలో కొందరు దుండగులు మూడు ఇళ్లలో చోరీలు చేసి లక్షలాది రూపాయల బంగారునగలు ఇంటి సామాన్లను దోచుకుని పరారయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు దేవరాజ మొహల్లా లోని ముగ్గురు వ్యాపారులు పొరుగూళ్లకు పనిమీద తమ కుటుంబాలతో తరలి వెళ్లగా చోరులు సమయం చూసుకుని ఆయా వ్యాపారులు ఇళ్ల తాళాలు బద్దలుగొట్టి చోరీలకు పాల్పడ్డారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

## కన్నడ సినీహీరో దునియా విజయ్ విడాకుల కేసును కొట్టేసిన కుటుంబ న్యాయస్థానం :



కన్నడ సినీహీరో దునియా విజయ్

బెంగళూరు, జూన్ 13, ప్రభాతవార్త ప్రతినిధి : కన్నడ సినీ అగ్రహీరో దునియా విజయ్ తన భార్య నుంచి విడా కులు కోరుతూ 2018లో బెంగళూరు ఫ్యామిలీ కోర్టుకు పెట్టుకున్న అర్జీను న్యాయస్థానం గురు వా రం కొట్టివేసింది. వివరాల్లోకి వెళి తే దునియా విజయ్ తన భార్య నాగ రత్న నుంచి విడాకులు కోరుతూ ఆరు సంవత్సరాల కిందట కోర్టుకు పిటీషన్ పెట్టుకున్నారు. ఈ కేసుకు ంబంధించి పలు సార్లు విచారణ జరిగి కేసు వాయిదా పడుతూ వచ్చాయి. కాగా గురువారం ఈ కేసును విచారణ జరిగిన శాంతి నగర్ లోని కుటుంబ న్యాయస్థానం దునిఆ విజయ్‌కు విడాకులు మంజూరు చేయ బో మంటూ కేసును కొట్టివేసింది. ఈ ఆరు సంవత్సరాల కాలంలో భర్త నుంచి వేరు గా నివాసం ఉంటున్న నాగరత్న చివరకు తనకు తన భర్తే కావాలంటూ ఆయ నతో సంసారం చేస్తానని న్యాయస్థానానికి చెప్పటంతో ఈమె అభ్యర్థనను పరి గణించిన ఫ్యామిలీకోర్టు దునియా విజయ్ విడాకుల కేసును కొట్టివేసిం ది. అయితే సదరు నాగరత్న నా తల్లితండ్రులను సరిగ్గా చూసుకోవటం లేదని క్రౌర్యం ఆధా రంగా విడాకులు మంజూరు చేయాలని దునియా విజయ్ విడాకులకు అర్జీ పెట్టుకున్నారు. కోర్టు వీటికి తగిన ఆధారాలు చూపలేదంటూ కేసు కొట్టివేసింది.

04ATP13_04ATP13.qxd 13-06-2024 PM 10:59 Page 1



## నిరుపేద విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

### - సాంఘీక సంక్షేమ వసతిగృహంలో ప్రవేశానికి ధరఖాస్తులు - హాస్టల్ వార్డెన్ కే.ఆధినారాయణ

పామిడి, జూన్ 13 ప్రభాతవార్త

నిరుపేద విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని సాంఘీక సంక్షేమ బాలుర వసతిగృహం వార్డెన్ కే.ఆధినారాయణ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యశిస్తున్న విద్యార్థులు సాంఘీక సంక్షేమ వసతిగహంలో ప్రవేశానికి ధరఖాస్తు చేసుకోవాలంటూ స్థానిక ఎద్దులపల్లి రోడ్డులోని సాంఘీక సంక్షేమ బాలుర వసతిగృహం నందు గురువారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో వార్డెన్ కే.ఆధినారాయణ తెలియ జేశారు. సాంఘీక సంక్షేమశాఖ ద్వార నిరుపేద విద్యార్థులకు అన్నివిధాల సౌకర్యాలను సమకూరుస్తూ వసతిగృహాలను నెలకొల్పటం జరిగిందని వసతిగృహం నందు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించటం జరుగుతుందన్నారు. ప్రభుత్వ నిభందనలను అనుసరించి షెడ్యూల్డు కులా లకు 70 శాతం, బిసిలకు 9 శాతం, ఎస్టీలకు 5 శాతం, ఓసిలకు 4 శాతం, ఏపిసిలకు 12 శాతం చొప్పున హాస్టల్ సీట్లను భర్తీ చేయటం చేస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 3వ తరగతి నుండి 10వ తరగతి వరకూ విద్యనభ్య శిస్తున్న విద్యార్థులు ధరఖాస్తు చేసుకునేందుకు అర్హు లు అని ఆసక్తి ఉన్నటు వంటి విద్యార్థులు ధరఖా స్తుతో పాటు 3 ఫోటోలు, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు ప్రతులు, టిసి అందజేయాల్సి ఉందన్నారు. ధరఖా స్తులు వసతిగృహం నం దు ఉచితంగా లభిస్తాయని మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యన భ్యశిస్తున్న విద్యార్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వార్డెన్ కే.ఆధి నారాయణ కోరారు.


వార్డెన్ ఆధినారాయణ

## స్వయం ఉపాధికై కిరాణా షాపు ఏర్పాటు

అనంతపురం న్యూటౌన్, జూన్ 13 ప్రభాతవార్త

.ప్రవాస భారతీయుల స్వచ్చంద సేవా సంస్థ హోప్ ఫర్ స్పందన ఆధ్వ ర్యంలో సంస్థ 155వ షాపుని అనంతపురం జిల్లా రాప్తాడు మండలం, ఉప్ప రపల్లి పంచాయితీ పరిధిలో నిరుపేద కుటుంబమైన హుస్సేన్‌బి కుటుంబానికి స్వయం ఉపాధిలో భాగంగా కిరాణా దుకాణంని పెట్టించడం జరిగింది. దాదాపు 1.50 లక్షల రూపాయల విలువతో కూడిన ఈ కిరాణా షాపుకి ప్రవాస భారతీయుల స్వచ్చ ంద సేవా సంస్థ ఏకం సంస్థ వారు ఆర్థిక సహకారం అందించారు. దివ్యాంగులకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాలలో దాదాపు 100 షాపులను పూర్తి చేసుకున్న హోప్ ఫర్ స్పందన నేడు తన 155 షాపుని సంస్థ ఉపాధ్యక్షుడు లక్ష్మీనరసింహ కోట పర్యవేక్షణలో, రెండు తెలుగు రాష్ట్రాల సంస్థల సమన్వ యకర్త డా.రఘు ఆరికపూడి ఆధ్వర్యంలో, సంస్థ సభ్యులు నంద్యాల రఘు నాథ్, ట్రేడ్ సంస్థ సభ్యులు యం.సుధాకర్, రాజ్‌కుమార్, దయ్యాల మహేష్, గ్రామ ప్రజల సమక్షంలో ప్రారంభోత్స వం కార్యక్ర మం జరిగింది. ఇంతటి గొప్ప అవకాశం కల్పి ంచిన హోం ఫర్ స్పందన సభ్యులందరికీ హుస్సేన్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



ఏర్పాటు చేయించిన కిరాణా షాప్

## సమగ్ర శిక్ష ప్రాంతీయ శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన నిదియాదేవి


అధికారులతో మాట్లాడుతున్న వైకోసం నిదియాదేవి


మొక్కలను నాటుతున్న వైకోసం నిదియాదేవి

అనంతపురం న్యూటౌన్, జూన్ 13 ప్రభాతవార్త

సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయ కర్త వైకోసం నిధియాదేవి గురు వారం బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడు సమీపంలోని సమగ్ర శిక్ష ప్రాంతీయ శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శిక్షణ కేంద్రంలో ఇంకి కల్పించాల్సి న అదనపు సౌకర్యాల గురించి పరిశీలిం చారు. మొత్తం శిక్షణ కేంద్రాన్ని కలియతిరిగారు, ఎక్కడెక్కడ ఈ సౌకర్యాలు కల్పించాలి అనే విషయంలో అధికారులకు సూచనలు చేశారు. అనంతరం మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా శిక్షణ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షణ ఈఈ శంకరయ్య, డిఈ జయ రాములు, ఎంఇ చంద్రశేఖర్‌రెడ్డి, సీఎంఓ గోపాల్, బుక్కరాయసముద్రం ఎంఈఓ నవీద, అలెస్కో, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నూతన ప్రభుత్వం మెగా డిఎస్సీ ప్రకటించడం అభినందనీయం

### - జీఓ నెంబర్ 117 రద్దు చేయడం ద్వారా మరన్నిపోస్టులు అవ సరం అవుతాయి - రాష్ట్రంలో దాదాపు 50వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయి

అనంతపురం న్యూటౌన్, జూన్ 13 ప్రభాతవార్త

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొలి సంతకం డిఎస్సీ నియామకంపై చేయడం అభినందనీయమని పేర్కొంటూ ఈ విధంగా ఉపాధ్యాయ పో స్టులభర్తీ చేయడం ద్వారా విద్యా నాణ్యత పెంచడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కృషికి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు నవ్యాంధ్ర టీచర్స్ అసోషియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శిలు హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా రాష్ట్రంలో 50 వేల పోస్టులుపైగా ఖాళీగా ఉన్నాయని పార్లమెంట్ సాక్షిగా తేటతెల్లమైనప్పటికీ, గత ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టులే ఖాళీలు లేవు ఉన్నట్లు చెప్పడంపై నవ్యాంధ్ర టీచర్స్ అసోషియేషన్ నిరంతరం ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్ళి గట్టిగా ప్రశ్నిస్తూనే ఉన్నామన్నారు.

## ఎడిసిసి బ్యాంకు నూతన సిఇఓగా సురేఖరాణి బాధ్యతల స్వీకరణ


ఎడిసిసి బ్యాంకు నూతన సిఇఓ సురేఖరాణి


నూతన సిఇఓకు అభినందనలు తెలుపుతున్న బ్యాంకు ఉద్యోగులు

అనంతపురం ఓల్డ్‌టౌన్, జూన్ 13 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణ అధికా రిగా బ్యాంకు జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న సురేఖరాణి పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. గురువారం బ్యాంకు ప్రధాన కార్యా లయంలో ఆమె బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు సిబ్బంది సహకార సంఘాల యూనియన్ నాయకులు అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉద్యోగులు అందరూ సమిష్టిగా పనిచేసి బ్యాంకు డిపా జిట్ల సేకరణ మీద ప్రత్యేక శ్రద్ధ చూపాలని, అలాగే బ్యాంకు నిరర్ధక ఆస్తు లను గణనీయంగా తగ్గించాలని, రైతులకు సకాలంలో పంట రుణాలను విరివిగా మంజూరు చేయాలని, ఖాతాదారులకు మెరుగైన, నాణ్యమైన సేవల ను అందచేయాలన్నారు. 2024-25 సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాలను అధికమించాలని ఆమె సిబ్బందిని ఆదేశించారు. దాదాపు వంద సంవత్స రాలపైగా చరిత్ర కలిగిన బ్యాంకుకు మహిళా సిఇఓగా తొలిసారి నియామకం కావడంతో పలువురు మహిళా సిబ్బంది సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొనండి

### -సిడిపిఓ వరలక్షిని ఆహ్వానించిన ఆలయ నిర్మాణ సంకల్పకులు పచ్చార్ల

ఓబుళదేవరచెరువు, జూన్ 13, ప్రభాతవార్త : ఈనెల 16న మండల పరిధిలోని యం కొత్తపల్లి బండపై కొలు వైన అయ్యప్ప స్వామి ఆలయ ంలో నిర్వహించే అక్షరాభ్యాస శుభకార్యక్రమంలో పాల్గొనా లని ఆలయ నిర్మాణ సంకల్ప కులు పచ్చార్ల ఆంజనే యులు నాయుడు సిడిపిఓ వరలక్ష్మిని ఆహ్వానించారు. గురువారం ఆయన స్థానిక సిడిపిఓ కార్యాలయానికి వెళ్లి ఆమెకు కరపత్రాలు అందచేసి హాజరుకావాలని కోరినట్లు తెలిపారు. అదే రోజు శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు వారి తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు పాల్గొని శుభప్రదం చేయాలిని ఆయన కోరారు. ఆలయ సేవకులు ఎస్‌బిఐ శ్రీనివాసులు ఆయనతో పాటు ఉన్నారు.


సిడిపిఓను ఆహ్వానిస్తున్న పచ్చార్ల

## పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే సునీత



విద్యార్థులకు నోట్ పుస్తకాలు, బెట్ సీట్స్, భోజన ప్లేట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీత

రామగిరి, జూన్ 13 ప్రభాతవార్త

రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలం నసనకోట సమీపంలో గత టిడిపి ప్రభుత్వం హయాంలో ప్రతిష్టాత్మకంగా రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా నిర్మించిన మహాత్మాజ్యోతిపూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను సంద ర్శించి పరిటాల సునీత, ఈ సందర్భంగా విద్యార్థినులకు నోట్ బుక్స్, బెడ్ సీట్స్, భోజనం ప్లేట్లు పంపిణీ చేయడంతోపాటు పాఠశాలలో బోధన, బోధ నేతర సిబ్బంది, విద్యార్థినుల అవసరాల గురించి పాఠశాల ప్రిన్సిపాల్‌తో చర్చించారు.

## ఈద్గా మైదానాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

కదిరి, జూన్ 13 ప్రభాతవార్త

కదిరి మున్సిపాలిటీలోని ఈద్గా మైదానంలో ఈ నెల 17న ముస్లిం సోదరులు జరుపుకునే బక్రీద్ పండుగ సందర్భంగా కదిరి ఎమ్మెల్యే కందికుం ట వెంకట ప్రసాద్ గురువారం ప్రార్థన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈద్గా కమిటీ సూచనల మేరకు ప్రార్థనలకు విచ్చేసిన మైనార్టీ సోదరులకు ప్రభు త్వం తరుపున అన్ని ఏర్పాట్లు చేస్తామ న్నారు. మున్సిపల్ అధికారులకు శానిటేషన్ సిబ్బందికి తగు చర్యలు తీసుకో వాలని ఆదేశించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా డైవర్షన్‌ను నియం త్రించేందుకు పోలీసులు సైతం తగు సూచనలు చేస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, కౌన్సిలర్లు ఆల్ఫా ముస్తఫా, ఎంఎస్.ఫయాజ్, మైనార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

## నీట్ ఫలితాల్లో మెరిసిన కదిరి విద్యార్థి

కదిరి, జూన్ 13 ప్రభాతవార్త

కదిరిపట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయ దంపతులు నిత్యానంద రెడ్డి, ఇందిరాల కుమారుడు సి.ఇశ్వేర్‌రెడ్డి ఉత్తమ ప్రతిభను కనబర్చినట్లు విద్యార్థి తల్లిదండ్రులు గురువారం తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు విజయవాడలోని శ్రీ చైతన్య విద్యా సంస్థల్లో విద్యను అభ్యసిస్తూ 967 మార్కులు సాధించి నీట్ ఫలితాల్లో 680 మార్కులతో 94.12 ఆల్ ఇండియా ర్యాంకు సాధించినట్లు వారు తెలిపారు. తన కుమారుడు నీట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో సంతోషం వ్యక్తం చేశారు.

## అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం

కదిరి, జూన్ 13 ప్రభాతవార్త

కదిరి మున్సిపల్ పరిధిలోని వీవర్స్ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రంను గురువారం కదిరి సిడి పిఒ రాధిక ఆధ్వర్యంలో అంగన్ వాడీ పిలుస్తోంది కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు సంవత్స రాలు పూర్తి అయిన పిల్లలకు అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో వారిని కేంద్రాల్లో చేర్పించుకుని విద్యాబోధన చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మమత, పాఠశాల హెచ్‌ఎం లావణ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు విజయలక్ష్మి, విజయకుమారి, సంధ్య, సుగుణ, చిన్నారులు పాల్గొన్నారు.

## ఎంపిడిఓ కార్యాలయంలోకి వర్షపు నీరు వెళ్లకుండా మట్టితో అడ్డుకట్ట

ఓబుళదేవరచెరువు, జూన్ 13, ప్రభాతవార్త : ఇటీవల కురుస్తున్న వర్షా లకు మండల పరిషత్ కా ర్యాలయ ఆవరణంలోకి వర్షపు నీ రు వచ్చిచేరంతో ప్రజలు కా ర్యా లయంలోకి రావాలంటే తీవ్ర అసౌకర్యానికి గురువుతు న్నారు. గత వారం రోజులుగా ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఎంపి డిఓ కారా ్యలయ అధికారు లు, పాలకులు పట్టించుకోకపోవడంతో సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు ఉంట్ల మహేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యే సింధూరరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ప్రజలు ఇబ్బందులకు గురి కాకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే సూచించడంతో మహేశ్వ ర్‌రెడ్డి తన సొంత నిధులతో గురు వారం ట్రాక్టర్ల ద్వారా మట్టిని తోలి వర్షపునీటికి అడ్డుకట్ట వేశాడు. దీంతో ప్రజలు, కార్యాలయ అధికారులు మహేశ్వర్‌రెడ్డిని అభినందించారు.


నీరు లోనికి వెళ్లకండా మట్టిని అడ్డుగా వేయిస్తున్న మహేశ్వర్‌రెడ్డి

### మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడును కలిసిన బిజెపి నాయకులు

తాడిపత్రిఅర్బన్, జూన్ 13 ప్రభాతవార్త

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నా యుడును గురువారం విజయ వాడ లోని ఆయన నివాసంలో బిజెపి నా యకులు మర్యాదపూర్వ కంగా కలిశారు. ఈ సం దర్భంగా ఆయనను శాలు వాతో పాటు పుష్పగుచ్చం అందచేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిజె పి కర్నూల్ జిల్లా ఇన్‌చార్జ్ అంకా ల్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యులు విట్ట, కర్నూల్ జిల్లా పార్లమెంట్ కన్వీనర్ రమేష్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ సతీష్ కుమార్, సత్యసాయి జిల్లా పార్లమెంట్ ఇన్‌చార్జ్ బాలకృష్ణయాదవ్, తాడి పత్రి బిజెపి మండల అధ్యక్షులు పి.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.


వెంకయ్యనాయుడును సత్కరిస్తున్న బిజెపి నాయకులు

## సీజనల్ వ్యాధుల నియంత్రణపై సమన్వయ సమావేశం

### - కమీషనర్ మేఘస్వరూప్

అనంతపురం కలెక్టరేట్, జూన్ 13 ప్రభాతవార్త

జిల్లాలో వర్షాలు ప్రారంభం కావడంతో సీజనల్ జ్వరాలు ఎక్కువగా నమోదయ్యే అవకాశం వున్నందున వాటిని అరికట్టడా నికి ముందస్తు చర్యలు చేపట్టాలని అనంతపురం నగరపాలక సంస్థ కమీషనర్ మేఘస్వరూప్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ మలేరి యా విభాగం అధికారి ఓబులు, నగరపాలక ఆరోగ్య అధికారి డాక్టర్ విష్ణుమూర్తితో కలిసి గురువారం సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కమీషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా తదితర వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. మలే రియా వర్కర్స్‌కు అవసరమైన మా స్కులు, గ్లౌజులు, బూట్లు తదితర సా మాగ్రి అందచేయాలని ఎంహెచ్ఒ డాక్టర్ విష్ణుమూర్తికి సూచించారు. అదేవి ధంగా లార్వా ఆపరేషన్, ఫాగింగ్ ఆపరే షన్ నిర్వహించడానికి అవసరమైన సాంకేతిక శిక్షణ ఇవ్వాలని జిల్లా మలేరి యా అధికారిని కోరారు. సబ్ యూనిట్ సిబ్బంది ఎంహెచ్ఒతో కలిసి వర్కర్ల పనితీరును పర్యావేక్షించాలని తెలియచేశారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వ హించేటప్పుడు ఆరోగ్య సిబ్బంది ప్రజలకు దోమల వల్ల వచ్చే జ్వరాల గురి ంచి పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించాలని సూచించారు. దోమలు కుట్టకుండా తీసుకునే జాగ్రత్తలను ప్రజలకు తెలియచేయాలన్నారు. జ్వరాలు నమోదైన ప్రాంతాల్లో సమర్థ వంతమైన నివారణ చర్యలు చేప ట్టా లని కమీషనర్ వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ మలేరియా అధికారి సత్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి మద్దయ్య, సూపర్‌వై జర్లు నూర్‌బాష, శ్రీధర్‌మూర్తి, మలేరియా అసిస్టెంట్ శంకరయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నగరపాలకసంస్థ కమీషనర్ మేఘస్వరూప్

### నగరపాలక సంస్థ పార్కులను సుందరంగా తీర్చిదిద్దాలి

### - కమీషనర్ మేఘస్వరూప్

స్థానిక రాంనగర్‌లోని సిద్ధార్థ పార్కును అన్ని వసతు లతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని కమీషనర్ మేఘ స్వరూప్ ఇంజనీరింగ్ అధికారు లను ఆదేశించారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని సిద్ధార్థ పార్కు అభివృద్ధి పనులను కమీషనర్ గురువారం సందర్శించారు. పార్కులో వాకింగ్ ట్రాక్ పనులు, గ్రీనరీ, లైటింగ్ తదితర సదుపాయాలను కల్పిసు న్నామని తెలిపారు. పార్కులోని జిమ్ పరికరాలు పనిచేస్తున్నాయా లేదా స్వయంగా పరిశీలించారు. కమీషనర్ అధికారులతో మాట్లాడుతూ నగరం లోని అన్ని పార్కులను పూర్తి అభివృద్ధి పరిచేలా చర్య లు తీసుకోవాలన్నారు. జిమ్ పరికరాలకు మరమ్మతులు వుంటే చేయా లన్నారు. పట్టణ ప్రజలు సేదతీరడానికి అన్ని రకాల సౌకర్యాలు అలాగే ఆహ్లాదకరమైన వాతావరణం వుండేలా చూడాల్సి న బాధ్యత నగరపాల కసంస్థదేనన్నారు. పార్కులో పచ్చ దనం మెరుగుపర్చాలని హార్టికల్చర్ ఏడి లక్ష్మిప్రసన్నను ఆదేశించారు. వాకర్స్ కొందరు కమీషనర్‌తో మాట్లాడుతూ సౌకర్యాలు కల్పిస్తుండడం పట్ల సంతో షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈఈ సూర్యనారాయణ, డిఇ సుభాష్‌చంద్రబోస్, హార్టికల్చర్ ఏడి లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

## పార్టీ కార్యకర్తలు అధైర్యపడకుండా అండగా ఉండండి

### - ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డికు సూచించిన మాజీ సీయం వై.ఎస్.జగన్

### -విజయవాడలో మాజీ సీయం వై.ఎస్.జగన్‌ను కలిసిన ఎమ్మెల్సీ

ఉరవకొండ, జూన్ 13 ప్రభాతవార్త

పార్టీ కార్యకర్తలు అధైర్యపడకుండా అండగా ఉండాలని మాజీ ముఖ్య మ ంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి ఎమ్మెల్సీ, శాసన మండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మెన్ వై.శివ రామిరెడ్డికు సూచించారు. విజ యవా డలోని క్యాంపు కార్యాలయంలో గురు వారం మాజీ సీయం వై.ఎస్ జగన్‌ను ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి మ ర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సం దర్భంగా సార్వత్రిక ఎన్నికల ఫలి తా లు, పరిణామాలపై కూలంకుషంగా వారు చర్చించారు. కార్యకర్తలకు అం డగా ఉండి వారు అధైర్య పడకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వై.ఎస్.జగన్ ఎమ్మెల్సీకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు నెరమెట్ల తిప్పారెడ్డి, దిద్దేకుంట సూరి నగేష్ పాల్గొన్నారు.


మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

## మహిళల అభ్యున్నతికి పాటుపడుతాం

### - అంతర్జాతీయ కుట్టు మిషన్ దినోత్సవంలో పెరుమాళ్ల జీవానందరెడ్డి

అనంతపురం, జూన్ 13 ప్రభాతవార్త బ్యూరో

మహిళల అభ్యున్నతికి పాటుపడుతాం కట్టుకున్న బట్ట వెనుక జడ్జి నైపు న్యం ఉంటుంది ఆ నైపుణ్యం కనిపించేలా చేసేది కుట్టు మిషన్ జాతీయ కు ట్టు మిషన్ దినోత్సవం అని వ్యాలీ గ్రీన్ గార్మెంట్ అధినేత్ర పెరు మాళ్ళ మమతారెడ్డి, తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు పిజె ఆర్ సోషల్ సర్వీసెస్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు పెరుమాళ్ల జీవానం దరెడ్డి పేర్కొన్నారు. గుంతకల్లు నియోజకవర్గం పామిడి మండలం గజరాంపల్లి గ్రామంలో ఉన్నటువంటి వ్యాలీ గ్రీన్‌గార్మెంట్ పరిశ్రమలో అంతర్జాతీయ కుట్టుమిషన్ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పెరుమాళ్ల జీవానందరెడ్డి మాట్లాడుతూ.. బుధవారం గన్నవరం నియోజక వర్గంలోని కేసరపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు సీఎంగా ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో పాల్గొని అక్కడ నుంచి బయల్దేరి గురువారం గజరాంపల్లి గ్రామంలో వ్యాలీగ్రీన్ గార్మెంట్ పరిశ్రమలో అంతర్జాతీయ కుట్టు మిషన్ దినోత్సవం జరుపుకు న్నామన్నారు. మహిళల అభివృద్ధికి పాటుపడుతామన్నారు. వ్యాలీ గ్రీన్ గార్మెంట్ పరిశ్రమలో 2000 మందికి ఉపాధి కల్పిస్తున్నామని ప్రస్తుతం 350 మంది పని చేస్తున్నా రన్నారు. వ్యాలీ గ్రీన్ గార్మెంట్ పరిశ్రమలో ఉద్యోగం కావాలను కున్నవారు 6304237701, 9888539999నెంబర్‌ని సంప్రదించాలని తెలిపారు.


పరిశ్రమలోని ఓ దృశ్యం

## 18న ఓబులేసుకోనలో స్వాతినక్షత్రం పూజలు

తాడిపత్రిరూరల్, జూన్ 13 ప్రభాతవార్త

మండలంలోని ఓబులేసుకోనలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 18 వతేదీ మంగళవారం స్వాతినక్షత్రం సందర్భ ంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిం చను న్నారు. స్వామివారి జన్మ నక్ష త్రం స్వాతి నక్ష త్రాన్ని పురస్కరించుకుని ఉదయం అర్చకులు స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, విశ్వక్సే నారాధన, వాసు దేవపు ణ్యాహవాచనము, నవకలశ స్థాపన, తిరు మంజనసేవ, ప్రాకారోత్స వం, స్వామి వారికి ప్రత్యేక అలంకరణ, కళ్యాణోత్స వం, తదితర పూజా కార్య క్రమాలను నిర్వహిం చను న్నారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి ఉత్స వ విగ్రహాలను పల్లకిలో వుంచి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయను న్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవాలని అర్చకులు తెలి యచే శారు. హాజరైన భక్తులకు అన్నదాన కార్య క్రమాన్ని ఏర్పాటు చేయనున్నారు.


శ్రీలక్ష్మీనరసింహస్వామి

## ముదిగుబ్బ పోలీసుస్టేషన్‌ను పరిశీలించిన జిల్లా ఎస్పి

ముదిగుబ్బ, జూన్ 13 ప్రభాతవార్త

ముదిగుబ్బ పోలీసుస్టే షన్‌ను గురువారం సత్యసాయి జిల్లా ఎస్పి మాధవరెడ్డి ఆకస్మిక తని ఖీ చేశారు. ఈ సందర్భంగా సిఐ యతేంద్రతో మండలం లోని పలు సమస్యాత్మక గ్రామా ల గురించి ఆరా తీశారు. ఎన్ని కల అనంతరం ఏవైనా అవా ంఛనీయ సంఘట నలు జరిగాయా అని అడిగి తెలుసుకు న్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతా వరణం వుండేలా చర్యలు తీసుకో వాల ని సిఐ యతేంద్రకు సూచించారు. అదేవిధంగా పట్నం పోలీసుస్టేషన్‌ను సందర్శించి అక్కడ కేసులపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించి ఎస్ఐ నరసిం హులుతో పోలీ సుస్టేషన్ పరిధిలోని ఫ్యాక్షన్ గ్రామాల్లో పర్యటించి సమస్యలు తలెత్తకుండా చూడాల న్నారు. గ్రామాల్లో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేయాలని ఎక్కడా కూడా కక్షసాధింపు చర్యలతో గొడవలు జరగకు ండా చూడాలన్నారు. అంతేకా కుండా అసాంఘిక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే అటువంటివారిపై కఠిన చర్యలు తీసుకుని ముందుజాగ్రత్తగా అటువంటి వారిని గుర్తించాలని ఎస్పి పేర్కొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పి మాధవరెడ్డి

## మాతృ, శిశు మరణాలు నివారించాలి

### - డిఎం అండ్ హెచ్ఓ డా.ఈబి.దేవి


మాట్లాడుతున్న డిఎం అండ్ హెచ్ఓ

అనంతపురం, జూన్ 13 ప్రభాతవార్త ప్రతినిధి

వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈబి.దేవి అధ్యక్షతన గత మాసంలో జిల్లాలో జరిగిన మాతృమరణాలు, శిశు మరణాల కు గల కారణాలు పైన సంబం ధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్, సిబ్బందితో సమీక్షా సమా వేశం నిర్వహించడం జరిగింది. ఈ సమీక్షా సందర్భంగా డిఎం హెచ్ఓ మాట్లా డుతూ.. మాతృ మరణాలు శిశు మరణాలు నివారించాలని, ముఖ్య ంగా శిశు మరణం కానీ మాతృ మరణం కానీ జరిగినప్పుడు మరణానికి గల కారణాలు తెలుసుకొని తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఐసిడి యస్‌ప్రాజెక్టు అధికారులు గర్భిణీ స్త్రీలకు అందించే న్యూట్రీషన్ ఫుడ్‌ను వారు సంపూర్ణంగా తీసుకొనేలా చూసి రక్తహీనతతో బాధపడకుండా చూడాల న్నారు. తల్లీ బిడ్డల వైద్యసేవల విషయంలో రెండు శాఖలు సమన్వయం చేసుకోవాలన్నారు. అ లాగే మాతృ మరణం జరిగినప్పుడు జిల్లా నోడల్ టీం కూడా క్షేత్రస్థాయికి వెళ్లి విచారిం చాలన్నారు. ప్రతి గర్భిణీ స్త్రీని 12 వారాలలోపు రిజిస్టార్ చేసుకొని, అన్ని రకాల వైద్య పరీక్షలు, వైద్య సేవలు అందించాలని కోరరు. ఈ సమా వేశంలో జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ పాల్ రవి కుమార్, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డా.యుగంధర్, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి డాక్టర్స్ నవీన్‌కుమార్, రేణుక, శంకర్‌నారాయణ, యంపిహెచ్ఈఓ లక్ష్మన్న, ఎంపిహెచ్ఎస్ హేమలత, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## రైతు భరోసా కేంద్రాన్ని అలా ఎలా కట్టారు

### - పునాదుల నుంచి ఊట నీరు వస్తుంటే పట్టించుకోరా

### - నాసిరకం నిర్మాణాలకు ఇదే ప్రత్యేక ఉదాహరణ.. పరిటాల సునీత


విత్తనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత


ఎమ్మెల్యే పరిటాల సునీతతో రైతులు, ఆర్‌బికె సిబ్బంది

రామగిరి, జూన్ 13 ప్రభాతవార్త

వైసీపీ ప్రభుత్వంలో నాసిరకం నిర్మాణాలకు రామగిరి మండలం నసనకోట పంచాయితీలో నిర్మించిన రైతు భరోసా కేంద్రమే సాక్ష్యం అని మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. గురువారం ఆమె నసనకోట పంచాయితీ కేంద్రంలోని రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. అయితే భవనం పునాదుల్లోంచి ఊట నీరు వస్తుండటంపై ఆమె ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రైతుకలు, ప్రజలకు సౌకర్యవంతంగా నిర్మించాల్సి న ప్రభుత్వ భవనా లను ఇలా నాసిరకంగా నిర్మించడం ఏంటని ప్రశ్నించారు. అక్రమ ధనార్జనే ధ్యేయంగా పనిచేసిన గత ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యానికి ఇది అద్దం పడుతోం దన్నారు. భవనాన్ని పరిశీలించి, భవనానికి ఎలాంటి ప్రమాదం జరగకుండా చూడాలని పంచాయితీ రాజ్ శాఖ జేఈ కిరణ్‌కు సూచించారు. భవనం చుట్టు ట్రెంచింగ్ కొట్టి, ఊట నీరు వలన భవనం పునాదులు దెబ్బతి నకుండా చూడాలన్నారు. ఇంకా మండలంలో ఇలాంటి నిర్మాణాలు ఎక్కడె క్కడ ఉన్నాయో చూడాలన్నారు.

## శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండండి - జిల్లా ఎస్పి గౌతమిశాలి


డిఎస్పి, సిఐతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పి గౌతమిశాలి

తాడిపత్రిఅర్బన్, జూన్ 13 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణం, పరిసర మండలాల్లో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా నిరం తరం అప్రమత్తంగా వుండాలని జిల్లా ఎస్పి గౌతమిశాలి ఆదే శించారు. తాడిపత్రి అర్బన్, రూరల్ యుపిఎస్ పోలీసుస్టేష న్లను జిల్లా ఎస్పి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలి ంగ్ రోజు ఆ తరువాత తాడి పత్రి ప్రాంతంలో చెలరేగిన ఘర్షణలు, అల్లర్లకు సంబంధించిన కేసులను సమీక్షించారు. పగలు, రాత్రి వేళల్లో నిర్వహించే బీట్స్ పెంచాలన్నారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు, ట్రబుల్ మాంగర్స్‌పై నిఘా వుంచాలన్నారు. ప్రజలు ప్రశాంతంగా జీవించేలా పరిస్థితులను కొన సాగాలే చర్యలు తీసుకో వాలని ఎస్పి ఆదేశించారు. ఎస్పి వెంట తాడిపత్రి డిఎస్పి జనార్ధన్ నాయుడు, సిఐ నాగేంద్రప్రసాద్, సిబ్బంది వున్నారు.